ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5
పల్నాడు జిల్లా వార్తలు

మంగళవారం 17 డిసెంబరు 2024


రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

తొలి స్నాతకోత్సవానికి ఎయిమ్స్ ముస్తాబు

- ముఖ్య అతిథిగా హాజరుకానున్న రాష్ట్రపతి
- నలుగురికి బంగారు పతకాలు
- పాల్గొంటున్న గవర్నర్, సీఎం


మంగళగిరి ఎయిమ్స్ ఆస్పత్రి భవన సముదాయం

మంగళగిరి ఎయిమ్స్ చిహ్నం

మంగళగిరి ఎయిమ్స్ వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ మొదటి బ్యాచ్ పూర్తి చేసుకుని పట్టాలను పొందుతున్న 47 మందిలో 17 మంది మహిళలు కాగా, మిగిలిన 30 మంది పురుషులే! మొత్తం 47 మందిలో నలుగురికి మాత్రం ఎయిమ్స్ యాజమాన్యం బంగారు పతకాలను ప్రకటించింది. ఈ నలుగురిలో ముగ్గురు మహిళలు కాగా ఒక్కరు మాత్రమే పురుషుడు. లియా ఆజీ, సుప్రభా సిన్హా, వీకే ఆథీరా, దాసరి దివ్యాన్ష అనే నలుగురికి బంగారు పతకాలను ప్రకటించారు.

నలుగురికి బంగారు పతకాలు

మంగళగిరి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని ఎయిమ్స్ మొదటి స్నాతకోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మొదటి బ్యాచ్ మెడికోలు తమ గ్రాడ్యుయేషన్‌ను పూర్తి చేసుకున్న సందర్భంగా తొలి స్నాతకోత్సవాన్ని పాలకవర్గం మంగళవారం మధ్యాహ్నం వేడుకగా జరిపేందుకు సన్నద్ధమైంది. ఈ వేడుకకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా హాజరై వైద్య విద్యార్థులకు పట్టాలను పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమానికి గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కేంద్ర ఆయుష్ ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి ప్రతాప్‌రావు జాదవ్, రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖమంత్రి సత్యకుమార్ యాదవ్, రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ తదితర ప్రముఖులు హాజరుకానున్నారు. ఈ స్నాతకోత్సవం మంగళవారం మధ్యాహ్నం 12:30 గంటలకు ఎయిమ్స్ ఆవరణలోని ఆడిటోరియంలో ప్రారంభమై గంటన్నరపాటు కొనసాగుతుంది. రాష్ట్రపతి ద్రౌపదిముర్ము స్నాతకోత్సవ ప్రసంగంచేసి ప్రతిభ చూపిన నలుగురు వైద్య విద్యార్థులకు బంగారుపతకాలను అందజేస్తారు. అలాగే, ఎంబీబీఎస్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసుకున్న 47 మందితోపాటు పోస్టు డాక్టోరల్ సర్టిఫికెట్ కోర్సును పూర్తి చేసుకున్న మరో నలుగురు విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేస్తారు.

విభజన వరాల్లో ఒకటి

రాష్ట్ర విభజన వరాలలో ఒకటిగా మంగళగిరిలో ఎయిమ్స్ ఆసుపత్రి ఏర్పాటయింది. గతంలో ఒక్క దేశ రాజధాని ఢిల్లీకి మాత్రమే పరిమితమై ఉన్న అఖిల భారత వైద్యవిజ్ఞాన సంస్థ సేవలను దేశ ప్రజలందరికీ అందించాలన్న బీజేపీ ప్రభుత్వ సంకల్ప కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా పలు ఎయిమ్స్ ఆసుపత్రుల స్థాపన దశలవారీగా ఆరంభమైంది. ఇందులో.. ఫేజ్-4లో భాగంగా ఏపీకి రూ. 1618 కోట్ల వ్యయంతో ఎయిమ్స్ ఆస్పత్రిని మంగళగిరిలో ఏర్పాటు చేసేవిధంగా (మిగతా 8వ పేజీలో)


స్నాతకోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి



- పెరుగుతున్న శ్వాసకోశ సమస్యలు!
- జలుబు, దగ్గు లక్షణాలతో పిల్లలు విలవిల
- ఇన్‌ఫ్లుయెంజా వైరస్ కారణమంటున్న వైద్యులు
- ప్రభుత్వ ప్రైవేటు వైద్యశాలలకు పెరుగుతున్న చిన్నారులు

చిన్నారులపై.. చలి పంజా

వాతావరణంలో కొద్దికాలంగా చలి పెరిగింది. ఉదయం పొగ మంచు కురుస్తోంది. మారిన వాతావరణ పరిస్థితులు చిన్నారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. చలి వాతావరణంలో ఇన్‌ఫ్లుయెంజా వైరస్ ప్రబలుతుండటంతో చిన్నారులు జలుబు, దగ్గు, ఆయాసం, జ్వరం, శ్వాసకోశ సమస్యలతో సతమతమవుతున్నారు. ఆయా సమస్యలతో గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి శిశు వైద్య విభాగంతో పాటు గుంటూరులోని పలు ప్రైవేటు చిన్న పిల్లల ఆస్పత్రులకు వస్తున్న బాధిత పిల్లల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. ఏడాదిలోపు చిన్నారుల్లో బ్రాంకైటిస్, ఆయాసం, దగ్గు, డొక్కలు ఎగరేస్తూ ఇబ్బందిపడుతున్నారు. గతంలో రోజుకు 150 మంది వరకు ఓపీ విభాగానికి వస్తుంటే, వ్యాధుల ప్రభావంతో ప్రస్తుతం ఓపీ సంఖ్య 200కు చేరినట్లు పీడియాట్రిక్ వైద్యులు చెబుతున్నారు.



గుంటూరు మెడికల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో చలి పెరడగంతో ఇన్‌ఫ్లుయెంజా ఏ, అడెనో వైరస్, వంటివి విజృంభిస్తున్నాయి. పది రోజులుగా వీటి ప్రభావంతో దగ్గు, జలుబు, ఆయాసంతో పాటు ఊపిరితిత్తుల్లో గాలి గొట్టాల వాపుతో చిన్నారులు విలవిల్లాడుతున్నారు. ప్రభుత్వ ప్రైవేటు ఆస్పత్రులకు వస్తున్న ఓపీలో 80 శాతం మంది చిన్నారుల్లో ఈ ఇబ్బందులే కనిపిస్తున్నట్లు డాక్టర్లు చెబుతున్నారు. గుంటూరు నగరంలో సుమారు 40 వరకు చిన్న పిల్లల ఆస్పత్రులు ఉన్నాయి. ఒక్కొక్క చోట ప్రతి రోజూ 60 నుంచి 100 వరకు ఓపీలు నమోదవుతున్నాయి. ఇదే అదనుగా కొన్ని ఆస్పత్రుల్లో ఓపీలు పెంచడంతో పాటు కార్డు పని చేసే కాల వ్యవధిని 15 రోజుల నుంచి పదికి, పది రోజుల నుంచి వారానికి కుదించేస్తున్నారు. పరీక్షలకు సంబంధించి ప్రైవేటు ల్యాబుల్లో రూ.వేలు ఖర్చవుతున్నాయి.

మధ్యస్థ తరహా వ్యాధి లక్షణాలు..

ఇన్‌ఫ్లుయెంజాను ముక్కు, గొంతు, ఊపిరితిత్తుల్లో సమస్యలు సృష్టించే వైరస్‌గా చెప్పవచ్చు. దీన్నే సీజనల్ ఫ్లూగా పిలుస్తారు. ఇందులో (మిగతా 6వ పేజీలో)

ఎస్‌ఏ -1 గణితం పరీక్ష రద్దు

- ప్రశ్న పత్రాలు.. యూట్యూబ్‌లో ప్రత్యక్షం
- ప్రశ్న పత్రాలన్నీ పోలీసుస్టేషన్‌కు తరలింపు


పోలీసు స్టేషన్‌లో ప్రశ్నపత్రాల బాక్సులు

గుంటూరు విద్య, డిసెంబరు 16 ఆంధ్రజ్యోతి: ఉమ్మడి జిల్లాలో సోమవారం జరగాల్సిన ఎస్‌ఏ-1 ప్రశ్నపత్రాలు ముందుగానే యూట్యూబ్‌లో ప్రత్యక్షం కావడంతో సోమవారం జరగాల్సిన పరీక్షల్ని విద్యాశాఖ రద్దుచేసింది. రాష్ట్రంలో ఏ జిల్లా నుంచి ప్రశ్నపత్రం లీక్‌అయిందనే విషయం విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్స్ విద్యార్థులకు ఈనెల నుంచి ఎస్‌ఏ-1 పరీక్షలు ప్రారంభం అయ్యాయి. పరీక్షలకు 6వ తరగతి నుంచి పదవ తరగతి విద్యార్థులు హాజరవుతున్నారు. తాజాగా సోమవారం జరగాల్సిన పది గణితం ప్రశ్నపత్రం ఆదివారం రాత్రి నుంచే యూట్యూబ్‌లో ప్రత్యక్షమైంది. దీంతో అప్రమత్తమైన రాష్ట్రస్థాయి అధికారులు గణితం పరీక్ష రద్దుచేస్తున్నట్లు ఉదయం డీఈవోలకు సమాచారం పంపారు. వెంటనే డీఈవోలు సమాచారాన్ని పాఠశాలల హెచ్‌ఎంలకు పంపడంతో సోమవారం పరీక్ష రద్దు అయింది.

ప్రశ్నపత్రాల బాక్సులు పోలీస్ స్టేషన్లకు....

ఎస్‌ఏ-1 పరీక్షలకు సంబంధించి ఇంకా మూడు సబ్జెక్టుల పరీక్షలు జరగాల్సి ఉంది. ప్రశ్నపత్రాల లీకేజీపై ఎంఈవోల స్థాయిలో సోమవారం సాయంత్రం హెచ్‌ఎంలతో సమీక్ష నిర్వహించారు. ఆయా ప్రశ్న పత్రాలను సమీపంలోని పోలీసు స్టేషన్లకు తరలించాలని విద్యాశాఖ అధికారులు హెచ్‌ఎంలకు సోమవారం ఆదేశాలు జారీ చేశారు. దీంతో హెచ్‌ఎంలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఒక్కో పాఠశాలకు వచ్చిన ప్రశ్నపత్రాల బాక్సులు మూడు, నాలుగు ఉన్నాయి. ఆయా బాక్సుల్ని స్టేషన్‌కు తరలించడానికి హెచ్‌ఎంలు తీవ్ర ఇబ్బందులు పడాల్సివచ్చింది. ప్రతిరోజు ఉదయం వాటిని స్టేషన్ నుంచి తీసుకురావడం మరలా పరీక్షలు నిర్వహించడం ఓ ప్రహసనంగా మారిందని, ఇందుకు అయ్యేరవాణా ఖర్చులు తాము భరించాల్సి వస్తోందని వారు వాపోయారు.

ప్రతిసారి ఎలా లీక్‌అవుతున్నాయో?

పాఠశాలల్లో జరిగే పరీక్షలకు సంబంధించి రాష్ట్రస్థాయిలో ప్రశ్న పత్రాలు సిద్ధం చేసి వాటిని జిల్లాకామన్ ఎగ్జామినేషన్ బోర్డుకు పంపుతారు. అక్కడి నుంచి ఎంఈవో కార్యాలయాలకు, తరువాత స్కూల్ కాంప్లెక్సులకు ఇవి సరఫరా చేస్తారు. అయితే గత ప్రభుత్వం ప్రశ్నపత్రాల సరఫరాపై తీవ్ర నిర్లక్ష్యం చేసింది. కొన్నిసార్లు పరీక్షకు ఒక రోజు ముందు వాట్సప్‌లో పెట్టడం వాటిని డౌన్‌లోడు చేసుకుని ఉపాధ్యాయులు బోర్డుపై రాయడం లేదా జిరాక్స్ తీసి పంపిణీ చేయడం చేశారు. ఫలితంగా అనేక సార్లు ప్రశ్నపత్రాలు లీక్ అయ్యాయి. అయినా పట్టించుకోకుండానే పరీక్షలు నిర్వహించారు. ఇటువంటి అవ లక్షణాల్ని కొత్త ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. ఫలితంగా పరీక్షల్ని రద్దుచేసి ప్రశ్నపత్రాలను పోలీసుస్టేషన్లకు తరలించినట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు. అయితే ఇందులో ఉండే వ్యయ ప్రయాసలు కూడా ప్రభుత్వం అర్థం చేసుకుని అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని సంఘాల నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు.


నేడు డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికలు

- 32 డీసీల ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి



నరసరావుపేట, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి) : సాగర్ కుడికాలువ పరిధిలోని డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు మంగళవారం ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించి జలవనరుల శాఖ ఏర్పాట్లు చేసింది. డీసీ అధ్యక్ష పదవుల కోసం కూటమిలో తీవ్ర పోటీ నెలకొంది. 32 డిస్ట్రిబూటరీ కమిటీలకు ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల నిర్వహణకు డీసీల వారీగా అధికారులను నియమించారు. నీటి సంఘాల తరహాలోనే డీసీలకు ఏకగ్రీవాలు జరగనున్నాయని ప్రచారం. ఎన్నికలు జరగనున్న డీసీల వివరాలు ఇలా ఉన్నాయి. మాచర్ల, గురజాల, కారంపూడి, కేసానుపల్లి, పిడుగురాళ్ల, తంగెడ, బెల్లంకొండ, క్రోసూరు డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయి. చామర్రు, నకరికల్లు, ముప్పాళ్ల, సత్తెనపల్లి, మేడికొండూరు, పెదకూరపాడు, అమరావతి, ఫిరంగిపురం, గుంటూరు, పొన్నెకల్లు, లింగంగుంట్ల, చిలకలూరిపేట-1,2, పెదనందిపాడు, సంతగుడిపాడు, రొంపిచర్ల, గంటావారిపాలెం, వినుకొండ, చీకటీగలపాలెం, ఐనవోలు, త్రిపురాపురం, ములకలూరు, సంతమాగులూరు, కొమ్మాలపాడు డీసీలు ఉన్నాయి. 234 నీటి సంఘాలకు ఏకగ్రీవ ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. డీసీ అధ్యక్షుడిని నీటి సంఘాల అధ్యక్షులు ఎన్నుకోనున్నారు. ఈ ఎన్నిక తర్వాత ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ ఎన్నిక జరుగుతుంది. ఈ పదవి ఆశిస్తున్న నేతల సంఖ్య కూటమిలో పెరుగుతోంది. నరసరావుపేట, సత్తెనపల్లి, గురజాల, మాచర్ల నియోజకవర్గాలలో పీసీ పదవిని ఆశిస్తున్నా నేతలు ఉన్నారు. వీరందరూ డీసీల బరిలో దిగుతున్నారు.

మొత్తం మీద పీసీ పదవి నేపథ్యంలో డీసీ పోటీ రసవత్తరంగా మారుతోంది. అయితే ప్రాజెక్టు కమిటీ ఎన్నికల తేదీని ప్రకటించాల్సి ఉంది.



తిరునాళ్ల డ్రోన్ చిత్రం (ఇన్‌సెట్లో) పోలీసు శాఖ వినియోగిస్తున్న డ్రోన్

నేరాల నియంత్రణలో.. డ్రోన్ నిఘా

◆ ఎస్పీ కంచి శ్రీనివాసరావు

నరసరావుపేట, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి) : నేరాల నియంత్రణలో డ్రోన్‌ల వినియోగం సత్ఫలితాలు ఇస్తున్నట్లు పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో వివరించారు. ఆదివారం జరిగిన ఎత్తిపోతల దత్త జయంతి, రెంటచింతల మండలం మంచికల్లు శ్రీ పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్ల, గురజాలలోని పాతపాటేశ్వరమ్మ తిరునాళ్ళ బందోబస్తులో భాగంగా డ్రోన్‌లను వినియోగించినట్లు వివరించారు. డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసిన ఎత్తిపోతల దత్త జయంతి. మంచికల్లు శ్రీ పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్ళు ప్రశాంతంగా ఎటువంటి గొడవలు లేకుండా ముగిశాయని తెలిపారు. అలానే గురజాల శ్రీ పాతపాటేశ్వరమ్మ తిరునాళ్ల డ్రోన్ నిఘాలో ప్రశాంతంగా జరిగిందన్నారు. జన సమూహం ఎక్కువగా ఉన్న ప్రదేశాలలో అనుమానితులను గుర్తించడానికి ఈ డ్రోన్ కెమెరాలు ఉపయోగపడతాయన్నారు. ప్రముఖుల పర్యటనల సమయంలో, వివిధ కార్యక్రమాలలో తక్కువ సిబ్బందితో ఎక్కువ ప్రదేశాన్ని కవర్ చేసి ఆయా ప్రదేశాలలో ఎటువంటి సంఘటనలు జరుగకుండా డ్రోన్‌లను వినియోగించి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

ఆర్థిక ప్రయోజనాలకు అడ్డమని అన్నదమ్ముల హతం

- సోదరులను కడతేర్చిన సోదరి
- పల్నాడు జిల్లా నకరికల్లులో దారుణం
- 20 రోజులైనా హత్యల ఉదంతం వెలుగు చూడని వైనం
- నేరం చేశానని చెప్పే దాక హత్యల ఆనవాళ్లను గుర్తించని పోలీసులు
- మృతదేహాల కోసం గాలింపు చర్యలు

మానవత్వం మంట కలసిన వేళ.. మానవ సంబంధాలు ఆర్థిక సంబంధాలేనని నిజమైన వేళ... ఆర్థిక సంబంధాల ముందు మానవ సంబంధాలు నిలబడవని నిరూపితమౌతున్న రోజులు ఇవి.. కుటుంబ వ్యవస్థ గాడి తప్పటంతో నేరాలే జీవిత ఘటనలుగా మారుతున్నాయి. భార్య, భర్తల మధ్య విభేదాలు తలెత్తటంతో అన్న భార్య పుట్టింటికి వెళ్లింది. తమ్ముడి భార్య భర్తకు విడాకులు ఇచ్చింది. వీళ్ల సోదరి భర్తకు విడాకులు ఇచ్చింది. మరొకరితో సహజీవనం చేస్తుంది. విఫలమైన కుటుంబ బంధం నేరాల ఊబిలో కూరుకు పోయింది. వీరి తండ్రి అనారోగ్యంతో చనిపోవటంతో ఆర్థిక లావాదేవీల విషయంలో వివాదం ఏర్పడింది. ఈ క్రమంలో అన్న, తమ్ముడిని చంపటానికి వెనుకాడకుండా వారిద్దరిని సోదరి కడ తేర్చింది. 20 రోజులుగా మానసిక సంఘర్షణ పడుతూ చివరికి పోలీసులను ఆశ్రయించి చేసిన నేరాన్ని వివరించింది.

నకరికల్లు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా నకరికల్లులో జరిగిన ఈ హత్యలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించాయి. వివరాల్లోకి వెళ్తే.. నకరికల్లుకు చెందిన తలపల పోలురాజు స్థానిక రామదాసు కాలనీలోని గిరిజన సంక్షేమ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. ఆయనకు ముగ్గురు సంతానం. పెద్ద కుమారుడు గోపి బొల్లాపల్లి మండలం బండ్లమోటు పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. మద్యానికి బానిసైన గోపి కొంతకాలంగా విధులకు హాజరు కావడంలేదు. ఎస్‌ఐ ఆవుల బాలకృష్ణ ఇతనికి మెమో ఇచ్చినట్టు పోలీసులు చెబుతున్నారు. అంతేగాక భార్యతోనూ విభేదాలు తలెత్తటంతో ఆమె పుట్టింటికి వెళ్లి పోయింది. వారి సంతానం ఇద్దరిని ఆమె తన వెంట తీసుకు వెళ్లింది. గోపి సోదరి కృష్ణవేణికి వివాహమైంది. సుమారు నాలుగు ఏళ్ల క్రితం ఆమె తన భర్తతో విడాకులు తీసుకుంది. నకరికల్లుకు వచ్చి పుట్టింట్లోనే ఉంటుంది. ఇక్కడ ఆమెకు పరిచయమైన ఒకరితో సహజీవనం చేస్తున్నట్టు స్థానికుల సమాచారం. వీరి సోదరుడు దుర్గా రామకృష్ణ నకరికల్లులో రామదాసు కాలనీలో నివాసం ఉంటున్నాడు. భార్యతో సఖ్యత లేక (మిగతా 6వ పేజీలో)


తలపల గోపి (ఫైల్)


దుర్గా రామకృష్ణ (ఫైల్)

వైభవంగా త్రికోటేశ్వరస్వామి ఆరుద్రోత్సవం

- స్వామికి ఇరుముడులు సమర్పించిన మేధా దక్షణామూర్తి స్వాములు

8 చరిత్ర చూసొద్దాం రండి

- సజీవ సాక్ష్యాలుగా చారిత్రక ఆధారాలు

నా భూమిని ఆక్రమించి ప్లాట్లు వేశారు 6

- అడ్డుకున్నందుకు అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపారు
- వైసీపీ హయాంలో రియల్టర్ తీరుపై ప్రజాదర్బారులో ఫిర్యాదు

పాఠశాలల ఫైవ్‌స్టార్ రేటింగ్ సాధనకు కృషి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గుంటూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం మేరకు పాఠశాలలకు ఫైవ్ స్టార్ రేటింగ్ తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని డీఈవో సీవీ రేణుక తెలిపారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'ఫైవ్ స్టార్‌లో ఒక్కటి లేదు' కథనానికి డీఈవో స్పందించారు. పాఠశాలల్లో రేటింగ్ పెంచేందుకు తరచుగా ప్రధానోపాధ్యాయులతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు విస్తృతంగా తనిఖీలు చేసి పాఠశాలల్లో ఉన్న లోపాలను గుర్తించి సరిదిద్దే పనులు చేపట్టామని చెప్పారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు శాతం పెంచి ఎస్‌ఎస్‌సీ పరీక్షల్లో మంచి ఫలితాల సాధనకు కృషి చేస్తామని తెలిపారు. సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షల్లో ఫలితాలను మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టాం. అలానే తరగతి గదుల్లో మంచి వాతావరణం, పాఠశాలలకు ప్రహరీ గోడల ఏర్పాటు, ఇంటర్నెట్ సదుపాయం, ఫర్నిచర్, లైబ్రరీ రూంల ఏర్పాటుపై దృష్టి పెట్టామన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం నిందితులు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగేశ్వరరావు, పక్కన సీఐ ప్రభాకరరావు, ఎస్‌ఐ కృష్ణారావు

నరసరావుపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి రాగి వైరు చోరీ చేసే ముఠా పోలీసులకు చిక్కింది. నలుగురు నిందితులను అరెస్టు చేసి ట్రాన్స్‌ఫార్మర్లలో చోరీ చేసిన రూ. 3.50 లక్షల విలువైన రాగి వైరును స్వాధీనం చేసుకున్నట్లు నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రూ.2 వేలు విలువైన రాగి వైరు కోసం ట్రాన్స్‌ఫార్మర్‌లను ధ్వంసం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ ఖరీదు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షలు వరకు ఉంటుంది. దాదాపు 145 ట్రాన్స్‌ఫార్మర్‌లను ధ్వంసం చేశారు. వీటి విలువ దాదాపు రూ 2.50 కోట్లు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాలతో పోలీసు శాఖ సదరు దొంగలపై ప్రత్యేక దృష్టి సారించింది. పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు నరసరావుపేట డీఎస్పీ కె. నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వినుకొండ రూరల్ సీఐ ప్రభాకర్, ఐనవోలు ఎస్‌ఐ కృష్ణారావు బృందం పల్నాడు, ప్రకాశం జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో నమోదైన కేసులను ఛేదించారు. పల్నాడు జిల్లాలో 19, ప్రకాశం జిల్లాలో 8, మొత్తం 27 కేసులు ఉన్నాయి. ఈ కేసులకు సంబంధించి ప్రకాశం జిల్లా అనసపాలెంకు చెందిన నల్లబోతుల పెద్ద యంగయ్య, నూజెండ్ల మండలం పెద్దవరం గ్రామానికి చెందిన బత్తుల కోటయ్య, వినుకొండ మండలం గాంధీనగర్‌కు చెందిన వీరబోయిన బాలయ్య, రొంపిచర్ల మండలం తురిమెళ్ల గ్రామానికి చెందిన తోలుసురి లక్ష్మీ నారాయణలను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 350 కిలోల రాగి వైరును స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ. 3.50 లక్షలని డీఎస్పీ నాగేశ్వరరావు తెలిపారు.

మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య



కల్యాణి (ఫైల్)

మంగళగిరి సిటీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలో ఓ మహిళా కానిస్టేబుల్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... 2018 బ్యాచ్‌కు చెందిన కల్యాణి (34) గత నాలుగు సంవత్సరాలుగా తాడేపల్లి పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తుంది. మంగళగిరి పట్టణంలోని మార్కండేయ కాలనీలో భర్త, ఇద్దరు పిల్లలతో కలిసి నివాసం ఉంటుంది. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి తన నివాసంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై మంగళగిరి పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కల్యాణి మృతికి గల కారణాలు తెలియాల్సి వుంది.

నా భూమిని ఆక్రమించి ప్లాట్లు వేశారు

- అడ్డుకున్నందుకు అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపారు
- వైసీపీ హయాంలో రియల్టర్ల తీరుపై ప్రజాదర్బారులో ఫిర్యాదు



రియల్‌దందాపై చీఫ్ విప్ జీవీ ఆంజనేయులుకు వినతి పత్రం అందజేస్తున్న దాదా సాహెబ్

వినుకొండటౌన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): వినుకొండ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాదర్బారు కార్యక్రమంలో గత ప్రభుత్వ హయాంలో కొందరు రియల్టర్లు భూకబ్జాలకు పాల్పడ్డారంటూ ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులుకు సోమవారం వినతి పత్రం సమర్పించారు. బాధితుడి షేక్ దాదా సాహెబ్ కథనం మేరకు పట్టణంలోని వెల్లటూరు రోడ్డులో గుడ్‌షఫర్డ్ పాఠశాల సమీపంలో 2021లో 40 సెంట్లు భూములు కొనుగోలు చేశానని, గత ప్రభుత్వ హయాంలో కొందరు రియల్టర్‌లు తాను కొనుగోలు చేసిన భూమిని అమ్మలేదని తమ కుటుంబంపై కేసులు నమోదు చేసి జైలుకు పంపించారని వాపోయారు. వైసీపీ ప్రభుత్వాన్ని అడ్డంపెట్టుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న కొందరు బడా నాయకులకు అప్పటి రెవెన్యూ అధికారులు, సర్వేర్లు తొత్తులుగా వ్యవహరించి రికార్డులను తారుమారు చేశారని ఆరోపించారు. తాము కొనుగోలు చేసిన భూమిని ఆక్రమించుకొని ప్లాట్లు ఏర్పాటుచేశారని, ఇదేమని అడిగితే దౌర్జన్యాలు, దాడులు, తప్పుడు కేసులు పెట్టి తమ కుటుంబాన్ని వేధించారంటూ వాపోయారు. జరిగిన సంఘటనపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయడంతో అక్రమదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సీఐ శోభన్‌బాబుకు సూచించారు.

ఆక్రమించి భూమిని చదును చేసి..

వెల్లటూరు రోడ్డులోని సర్వే నంబరు 251లోని 4 ఎకరాల భూమిలో గల ఎన్‌ఎస్‌పీ కాల్వను గత ప్రభుత్వం అండతో ప్రభుత్వ సానుభూతి పరులు అక్రమంగా ఎన్‌ఎస్‌పీ కాల్వ భూమిని ఆక్రమించుకొని భూమిని చదునుచేసి నిర్మాణాలు చేపట్టారు. దీంతో పెరుమాళపల్లి మేజర్ కాల్వ నుంచి సింగరు చెరువు వరకు ఉన్న మైనర్ కాలువ కనుమరుగైంది. సర్వే నంబరు 246/4, 246/5, 251లోని ఎన్‌ఎస్‌పీ కాలువ భూమి సుమారు 80 సెంట్లు మేర ఆక్రమణకు గురికావడంతో స్థానికులు సోమవారం అధికారులకు ఫిర్యాదు చేశారు. త్వరలో జిల్లా సర్వేయర్ చేత సర్వే చేయించి ఆక్రమణకు పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఫిర్యాదుదారులకు భరోసా ఇచ్చారు.

మందేసి....చిందేసి...!

- బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మందు తాగుతూ...చిందేస్తూ
- బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్సీ పుట్టినరోజు వేడుకల్లో హల్‌చల్
- వీడియోలు నెట్టింట వైరల్



మందు బాటిల్‌తో బాపట్ల ఎమ్మెల్యే వేగేశన

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ కార్యక్రమాల్లో మనం ప్రొటోకాల్ చూసుంటాం... ఎందుకంటే రాజ్యాంగ బద్ధమైన పదవుల్లో ఉన్నవారికి దక్కే గౌరవం అది. కానీ ఏకంగా ఓ నేత పుట్టిన రోజు వేడుకల్లో షాంపైన్ పొంగించడానికి ఎమ్మెల్యేకు ప్రొటోకాల్ గుర్తుచేసి దానిని ఓపెన్ చేసే మహద్భాగ్యం సదరు నేతకు కల్పించడం, మందేసి చిందేయడం వీటన్నింటికీ బాపట్లలోని పాండురంగాపురం బీచ్ వేదికగా నిలిచింది. ఈ నెల 11న బాపట్లకు చెందిన బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ పుట్టిన రోజు కావడంతో, పదో తేదీ అర్ధరాత్రి నుంచే పాండురంగాపురం బీచ్ వేదికగా వేడుకలకు తెర తీశారు. బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత అనంత వర్మతోపాటు పలువురు నేతలు, అనుచరులు ఈ వేడుకల్లో భాగస్వాములయ్యారు. వేడుకల్లో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మందు గ్లాసు చేతిలో పట్టుకుని చిందేసిన వీడియోలు నెట్టింట వైరల్ కావడంతో పాటు వారి మధ్య జరిగిన సంభాషణలు కూడా ప్రజల్లో చర్చకు దారి తీశాయి. వేడుకల్లో భాగంగా షాంపైన్ బాటిల్ ఓపెన్ చేసే క్రమంలో అన్నీ ఆయనే ఓపెన్ చేయాలా అని ఒకరంటే ప్రొటోకాల్ అని వైసీపీ నేత అనంతవర్మ అనడం, సదరు బాటిల్‌ను ఎమ్మెల్యే నరేంద్రవర్మే ఓపెన్ చేయడం ఇవన్నీ కూడా సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. పుట్టిన రోజు వేడుకలు జరిగి వారం గడిచాక అక్కడ అంతర్గతంగా జరిగిన వీడియోలు బయటకు రావడం వెనక అక్కడ వేడుకల్లో పాల్గొన్న వారే కావాలనే వీటిని బయటకు విడుదల చేశారనే అనుమానాన్ని నేతలు వ్యక్తం చేస్తున్నారు

సాధారణమే కానీ....

ప్రైవేటు కార్యక్రమంగా జరిగిన పుట్టిన రోజు వేడుకల్లో మందేయడం, చిందేయడం, మ్యూజికల్ నైట్ ఇవన్నీ కూడా సర్వ సాధారణమే. కానీ ఆ వేడుకల్లో పాల్గొన్నది ప్రస్తుతం టీడీపీ తరఫున బాపట్ల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కావడంతో ఆ మందు, చిందులపై సర్వత్రా చర్చ నడుస్తోంది.

ఆర్థిక ప్రయోజనాలకు అడ్డమని..

అన్నదమ్ముల హతం

(5వ పేజీ తరువాయి)

విడాకులు తీసుకున్నారు.

ఆర్థిక విభేదాలే హత్యకు కారణాలు

ఈ ఏడాది జనవరిలో వీరి తండ్రి పోలురాజు అనారోగ్య కారణంగా మృతి చెందారు. చనిపోయిన తరువాత అతనికి ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలు విషయంలో ఈ ముగ్గురి మధ్య విభేదాలు వచ్చాయి. తండ్రిని తాను దగ్గరుండి చూశానని, ఆర్థిక ప్రయోజనాల్లో తనకు రావాల్సిన వాటా ఇవ్వాలనీ, అలాగే తన తండ్రి మరణానంతరం కారుణ్య నియామక ఉద్యోగం తనకు వచ్చే విధంగా సహకరించాలని సోదరులను ఆమె కోరింది. ఈ విషయంలో దుర్గా రామకృష్ణ తనకు ఎక్కడ అడ్డం వస్తాడోనని నవంబరు 26న అతన్ని మేజరు కాలువలోకి నెట్టి హత మార్చింది. తన అన్న కానిస్టేబుల్ గోపి ఆర్థిక ప్రయోజనాలకు ఎక్కడ అడ్డు పడతాడోనని డిసెంబరు 10న మద్యం తాగించి మెడకు చున్నీ వేసి బిగించి చనిపోయిన అనంతరం బ్రాంచ్ కెనాల్‌లో పడవేసినట్లు కృష్ణవేణి ఈ నెల 15న నకరికల్లు పోలీసు స్టేషన్‌లో పోలీసులకు చెప్పినట్లు తెలిసింది. 20 రోజుల వ్యవధిలో అన్నదమ్ములు ఇద్దరినీ హతమార్చిన ఆమె పోలీసు స్టేషన్‌కు వచ్చి తెలిపేంత వరకూ హత్యలకు సంబంధించి ఎవరికీ తెలియని పరిస్థితి. కానిస్టేబుల్ గోపికి ఇద్దరు కుమార్తెలు, దుర్గా రామకృష్ణకు ఇద్దరు కుమారులు ఉన్నారు. కృష్ణవేణికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. తల్లిదండ్రుల మధ్య ఏర్పడిన విభేదాలతో దుర్గా రామకృష్ణ కుమారులు ఇద్దరూ అనాథలుగా మిగిలారు. కానిస్టేబుల్ గోపి కుమార్తెలు తండ్రిని పోగొట్టుకున్నారు.

హత్య ఆనవాళ్లను గుర్తించని పోలీసులు

నకరికల్లుకు చెందిన దుర్గా రామకృష్ణ గత నెల 26న హత్యకు గురైనట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. 20 రోజుల వరకు పోలీసులకు ఎలాంటి సమాచారం తెలియకపోవడం పోలీసు శాఖలోని నిఘా వైఫల్యాన్ని తేటతెల్లం చేస్తుంది. ఫిర్యాదు రాలేదు కనుక విషయం తెలియలేదని పోలీసులు చెప్పడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

మృతదేహాల ఆచూకీ లేదు

గత నెల 26న హత్య చేసి కాలువలో పడవేసినట్లు పోలీసులకు అందిన సమాచారం ఆధారంగా సోమవారం పుట్టను తెప్పించారు. గాలింపు చర్యలు చేపట్టనున్నట్లు పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా ఈనెల 10న నుంచి కన్పించని కానిస్టేబుల్ గోపి మృతదేహం ఆచూకీ లభించలేదు. ఈ నెల 14న ముప్పాళ్ల పవర్ ప్లాంట్ వద్ద ఒక గుర్తుతెలియని మృతదేహాన్ని కనుగొన్నారు. ఆ మృతదేహం ఎవరిది అనే విషయంపై డీఎన్‌ఏ పరీక్షలు నిర్వహించాల్సి ఉందని పోలీసులు చెబుతున్నారు. డీఎన్‌ఏ పరీక్షల అనంతరం ఆ మృతదేహం ఎవరిదనేది నిర్ధారిస్తామని అంటున్నారు.

కేసు నమోదు చేయలేదు

అన్నదమ్ముల హత్య విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదనీ, ఇంతవరకు ఈ సంఘటనకు సంబంధించి కేసు నమోదు చేయలేదని సత్తెనపల్లి రూరల్ సీఐ ఎంవీ సుబ్బారావు సోమవారం తెలిపారు. మృతదేహాల కోసం గాలింపు చర్యలు చేపట్టామని, ఈ హత్యల విషయాన్ని దర్యాప్తు చేస్తున్నామని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ

పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు సోమవారం రాత్రి హత్యలకు సంబంధించిన సంఘటనా స్థలాలను పరిశీలించారు. గోరంట్ల మేజరు పరిసరాలను, కృష్ణవేణి నివాసం ఉంటున్న ఇంటి ప్రాంతాన్ని కానిస్టేబుల్ గోపి, అతని సోదరుడు దుర్గా రామకృష్ణ నివాసం ఉంటున్న ప్రాంతాలను ఆయన పరిశీలించారు. నకరికల్లు పోలీసు స్టేషన్‌లో సత్తెనపల్లి రూరల్ సీఐ ఎంవీ సుబ్బారావు, ఎస్‌ఐ సురేష్‌లతో సంఘటనా వివరాలపై ఆరా తీశారు. కానిస్టేబుల్ గోపి భార్య, పిల్లలను, దుర్గ రామకృష్ణ భార్య పిల్లలను ఎస్పీ పరామర్శించారు.

నీటికుంటలో గల్లంతైన విద్యార్థి మృతి

మేడికొండూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నీటికుంటలో గల్లంతైన బీఫార్మసీ విద్యార్థి మూల్పూరి రంజిత్ (21) మృతి చెందాడు. మేడికొండూరు మండలం, భీమినేనివారిపాలెంలోని ఓ ఫార్మసీ కళాశాలలో బీఫార్మసీ 4వ సంవత్సరం చదువుతున్న విద్యార్థి మూల్పూరి రంజిత్ కళాశాల సమీపంలోని నీటికుంటలో ఆదివారం ఈతకు దిగి గల్లంతైన విషయం విదితమే. సోమవారం నీటి కుంటలో గాలించిన పోలీసులకు రంజిత్ మృతదేహం లభించింది. మేడికొండూరు సీఐ నాగూర్ మీరా సాహెబ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా కళాశాల యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి కారణంగానే విద్యార్థి రంజిత్ మృతి చెందాడని ఆగ్రహిస్తూ పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు విద్యార్థి కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళనకు దిగారు. కళాశాల ఆవరణలో మృతదేహాన్ని ఉంచి ధర్నా నిర్వహించారు. న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో మధ్యాహ్నం తరువాత మృతదేహం తరలించడానికి ఎమ్మార్పీఎస్ నాయకులు అంగీకరించారు.

చిన్నారులపై.. చలి పంజా

(5వ పేజీ తరువాయి)

ఇన్‌ఫ్లుయెంజా ఏ, బీ అనే రెండు రకాలు ఉంటాయి. ఏ రకం ఊపిరితిత్తులపై ప్రభావం చూపడంతో పాటు అలసట, జ్వరం, ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలను కలిగిస్తుంది. చలి కాలంలో ఇది విజృంభిస్తుంది. రోగుల దగ్గులు, తుమ్ముల ద్వారా ఒకరి నుంచి మరొకరికి సులువుగా వ్యాపిస్తాయి. "నగరంలో ఫ్లూ బాధిత చిన్నారుల్లో మధ్య తరహా వ్యాధి లక్షణాలు మాత్రమే కనిపిస్తున్నాయి. బాధితులు ఆసుపత్రుల్లో చేరి చికిత్సలు పొందాల్సినంత తీవ్రస్థాయిలో వ్యాధి లక్షణాలు లేవని" గుంటూరు జీజీహెచ్ పీడియాట్రిక్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రమేష్ తెలిపారు. ప్రభుత్వాస్పత్రికి వస్తున్న కేసుల్లో వ్యాధి లక్షణాలు తీవ్రంగా ఉన్న వారిని మాత్రం అడ్మిట్ చేసుకుని చికిత్సలు అందిస్తున్నట్లు ఆయన వివరించార

జాగ్రత్తలు ఇవీ...

- పెద్దలు ఏడాదిలోపు చిన్నారులను పట్టుకునే ముందు చేతులు శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలి. మాస్క్ ధరించాలి. తల్లిపాలే శిశువులకు అందించాలి
- ఏడేళ్లలోపు పిల్లలను సాయంత్రం ఆరు నుంచి ఉదయం ఏడు గంటల వరకు బయటకు తీసుకెళ్లకూడదు.
- రాత్రి సమయాల్లో ఏసీల వినియోగం పూర్తిగా మానేయాలి. చిన్నారులు నిద్రించే గదుల్లో ఫ్యాన్ల వేగం తగ్గించాలి
- చలి కాలంలో ఐస్‌క్రీములు, కూల్‌డ్రింకులు వంటి చల్లని పదార్థాలను పిల్లలకు ఇవ్వకూడదు. గోరువెచ్చని నీళ్లు తాగించాలి
- ఐదేళ్లు వచ్చే వరకు ప్రతి ఏడాది ఫ్లూ వ్యాక్సిన్ ఇప్పించడం మంచిది. ఆస్తమా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఇన్‌హేలర్లు వినియోగించాలి.
- చిన్నారుల్లో వ్యాధి నిరోధక శక్తి పెంచేలా పోషకాహారం అందించాలి.

తక్కువ వ్యాధి నిరోధక శక్తి ఉండటం వల్లే చలికాలంలో ఎక్కువగా వ్యాధుల బారిన పడతారు.

- మూడు రోజులకు మించి జలుబు, దగ్గు ఉంటే వైద్యుడిని సంప్రదించి చికిత్సలు చేయించాలి.

బేస్‌బాల్ విజేతలుగా గుంటూరు జట్లు



విజేత బాలిక జట్టుకు కప్పు అందిస్తున్న ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ధూళిపాళ్ళ సమీపంలో గల లయోల ఇంజనీరింగ్ కళాశాల క్రీడా మైదానంలో మూడు రోజులుగా జరుగుతున్న 68వ రాష్ట్ర స్థాయి అండర్ - 19 స్కూల్ గేమ్స్ బేస్ బాల్ పోటీల్లో బాలుర, బాలికల విభాగంలో గుంటూరు జిల్లా జట్లు విజేతలుగా నిలిచాయి. కాగా సోమవారం పోటీలు ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొని విజేతలు ట్రోఫీలను అందజేశారు. ముందుగా ఆయన మాట్లాడుతూ క్రీడాభివృద్ధికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని అన్నారు. క్రీడల పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంతో సానుకూలంగా పని చేస్తున్నారన్నారు. క్రీడాకారులకు ఉద్యోగాల్లో రిజర్వేషన్‌ను రెండు నుంచి మూడు శాతానికి పెంచటం క్రీడాభివృద్ధికి దోహద పడుతుందన్నారు. తాను కూడా ఒకప్పుడు క్రీడాకారుడినేనని, క్రీడాకారులు పడే ఇబ్బందులు తనకు తెలుసునన్నారు. బాలుర విభాగంలో మొదటి స్థానం గుంటూరు జిల్లా జట్టు, రెండో స్థానం పశ్చిమ గోదావరి జిల్లా జట్టు, మూడో స్థానం విజయనగరం జిల్లా జట్లు నిలిచాయి. బాలికల విభాగంలో మొదటి స్థానం గుంటూరు జిల్లా, రెండవ స్థానం శ్రీకాకుళం జిల్లా, మూడవ స్థానం విజయనగరం జిల్లా జట్లు నిలిచాయి. విజేత జట్లకు ఎమ్మెల్యే కన్నా ట్రోఫీ, ప్రశంసా పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ కార్యదర్శి జీ నరసింహారావు, సహాయ కార్యదర్శి సీహెచ్ పద్మాకర్, టోర్నమెంట్ పరిశీలకులు పీ నాగేంద్రం, యూ నీలిమ, కళాశాల డైరెక్టర్ వంశీ కృష్ణారెడ్డి, టీడీపీ నాయకులు, పీఈటీలు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధిత రైతుల బాండ్ల తనిఖీ

దుగ్గిరాల, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): గతేడాది జనవరి 19న స్థానిక శుభం కోల్డ్‌స్టోరేజ్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన రైతులకు సంబంధించిన బాండ్‌లను బీమా సంస్థ బృందం సోమవారం తనిఖీ చేసింది. నష్టపోయిన రైతులకు కోల్డ్‌స్టోరేజ్ యాజమాన్యం పరిహారం అందించకపోవడంతో పలువురు రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకోలు నిర్వహించారు. కోట్లాది రూపాయలను నష్టపోయినప్పటికీ సరైన స్పందన లభించక పోవడంతో అప్పటి జిల్లా కలెక్టర్ నేతృత్వంలో అర్హులైన రైతులను గుర్తించి వారందరికీ న్యాయం చేసేందుకుగానూ, అధికారులు, రైతులు, రైతుసంఘాల నాయకులతో ఓ కమిటీ ఏర్పాటు చేశారు. వచ్చే జనవరి 19నాటికి ఏడాది కావస్తుండగా నేటికీ పంటబీమాకు సంబంధించి ఎలాంటి ప్రకటన రాలేదని రైతులు ఆందోళన చెందుతూ వచ్చారు. 400 మందికిపైగా రైతులకు సంబంధించిన పసుపు నిల్వలపై కోట్లాది రూపాయల పరిహారం అందించే క్రమంలో భాగంగా ఇండియా ఇన్స్యూరెన్స్ సంస్థకు సంబంధించి రైతుల వద్దనున్న బాండ్లను పరిశీలించేందుకు వచ్చినట్లు ప్రతినిధి జుబేర్ ఆలీఖాన్ సోమవారం తెలిపారు. కచ్చితమైన బాండ్లను కలిగి అర్హులైన రైతులను గుర్తించి నివేదికను ప్రభుత్వానికి, బీమా సంస్థకు అందజేస్తామని చెప్పారు.

అట్టహాసంగా ఎడ్లబండలాగుడు పోటీలు



ప్రథమస్థానం సాధించిన నంద్యాల ఎడ్లజత

గురజాలటౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతపాటేశ్వరి అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బండలాగుడు పోటీలను గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ప్రారంభించారు. మొదటి రోజైన సోమవారం సీనియర్స్ విభాగంలో పోటీలు నిర్వహించగా నంద్యాల మండలం పెదకోట్లాలకు చెందిన బోరెడ్డి కేశవరెడ్డి ఎడ్లజత పందెపు బండను నిర్ణీత సమయంలో 3439.6 అడుగుల దూరం లాగి ప్రథమస్థానంలో నిలిచింది. అలాగే కృష్ణా జిల్లా పెనమలూరు మండలం పెదపులిపాకకు చెందిన గరికపాటి శ్రీధర్ ఎడ్లజత 3200 అడుగులతో రెండోస్థానం, తెలంగాణ రాష్ట్రం నాగర్ కర్నూల్ జిల్లా, పెనమలూరు మండలం, యాదిరెడ్డిపల్లెకు చెందిన డాక్టర్ అకిలేష్‌రెడ్డి ఎడ్లజత 3090.3 అడుగులతో మూడోస్థానం, పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం కేశానుపల్లికి చెందిన నెల్లూరి రామకోటయ్య ఎడ్లజత 3045.2 అడుగులతో నాలుగోస్థానం, గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కుంచనపల్లికి చెందిన పులగం అశ్వితారెడ్డి ఎడ్లజత 2800 అడుగులతో ఐదోస్థానంలో నిలిచాయి. ప్రథమ బహుమతి సాధించిన ఎడ్లజతకు విక్టర్ బయో జెనిటిక్స్ ఎండి తోట శ్రీనివాసరావు రూ. లక్ష బహుమతిని అందించారు. కాగా మంగళవారం జూనియర్స్ విభాగంలో పోటీలు జరగనున్నాయి. పట్టణానికి చెందిన దివ్యాంగుడు గాలయ్యకు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఎలక్ట్రికల్ ట్రైసైకిల్‌ను అందించారు.

నీటి కుంటలో పడి ఇద్దరు మృతి



ఆసుపత్రిలో మృతదేహాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

గురజాలటౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నీటి కుంటలో పడి ఇద్దరు మృతి చెందిన సంఘటన మండలంలోని పులిపాడు గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని పులిపాడు గ్రామానికి చెందిన శ్రీనివాసరావు, మాధవి దంపతుల కుమారుడు సుభాష్ (11) దాచేపల్లి పట్టణంలోని ఓ స్కూల్‌లో ఐదో తరగతి చదువుతున్నాడు. సోమవారం ఉదయం బడికి వెళ్లేందుకు స్కూల్ బస్సు ఎక్కాడు. గ్రామం నుంచి కొంత దూరం వెళ్లాక బస్సు డ్రైవర్ కోటేశ్వరరావు రేడియేటర్‌లో నీళ్లు అయిపోవడంతో రోడ్డు పక్కన బస్సు నిలిపాడు. రోడ్డు పక్కన ఉన్న నర్సరీ వద్ద గల నీటికుంటలో నీరు తేవాలని దాచేపల్లి మండలం ఇరికేపల్లికి చెందిన బస్సు క్లీనర్ కోటేశ్వరరావు (55)కు చెప్పారు. అయితే నీటి కోసం బాలుడు సుభాష్, క్లీనర్ కోటేశ్వరరావు వెళ్లారు. అయితే సుభాష్ నీటికుంటలో దిగి మునిగిపోయాడు. సుభాష్‌ను కాపాడే క్రమంలో నీటికుంటలోకి దిగిన క్లీనర్ కోటేశ్వరరావు కూడా కుంటలో మునిగిపోయాడు. విషయం తెలుసుకున్న డీఎస్పీ జగదీష్, సీఐ భాస్కర్, ఎస్‌ఐ వినోద్ సంఘటనా ప్రదేశానికి వెళ్లి మృతదేహాలను వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను గురజాల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఒక్కగానొక్క కుమారుడు అర్ధాంతరంగా తనువు చాలించడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

పరామర్శించిన ఎమ్మెల్యే యరపతినేని

ప్రభుత్వ ఆసుపత్రిలో మృతదేహాలను గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సందర్శించారు. బాలుడి కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలిపారు. బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.30
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	107.115.126
చికెన్ విత్ స్కిన్	204.00
చికెన్ స్కిన్ లెస్	214.00

51,264 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 57,488 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 51,264 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 42,799 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7500	14000	334	8500	15500
నెంబరు. 5	8000	13000	నెంబరు.5	--	--
273	8000	11500	273	10000	11000
341	8000	15500	341	8000	14500
4884	--	--	4884	--	--
సూపర్ 10	11500	13000	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	16500	తేజ	8000	16000
బ్యాడిగి	8000	12500	బ్యాడిగి	7500	12500
దేవనూరు డీలక్స్	8000	15500	దేవనూరు డీలక్స్	10500	14000
తెల్లకాయలు	4000	11000	తెల్లకాయలు	4500	10000

పల్నాడు వార్తలు

పులిచింతల సమాచారం

అచ్చంపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 41.39 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా రెండు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు.



● గురజాల నియోజకవర్గ పరిధిలో ఏకగ్రీవంగా ఎన్నికైన సాగునీటి సంఘాల అధ్యక్షులు, సభ్యుల ఆత్మీయ సమావేశం ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అధ్యక్షతన మంగళవారం పిడుగురాళ్ల శుభమస్తు కల్యాణ మండపంలో జరుగనుంది.

● పిడుగురాళ్ల మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 20వ తేదీ ఉదయం 11 గంటలకు ఎంపీపీ గార్లపాటి అనసూర్య అధ్యక్షతన జరుగనుందని ఎంపీడీవో సీహెచ్ రామచంద్రరావు తెలిపారు.

నీటి సరఫరా నిలిపివేత

సత్తెనపల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 10వ వార్డు నాగార్జున నగర్‌లో రక్షిత మంచి నీటి పథకం వాల్వ్ మరమ్మతు నిమిత్తం బుధవారం ఒక రోజు క్రిష్టియన్ పేట, నాగార్జున నగర్ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ షమ్మి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు

హుండీ ఆదాయం రూ. 3,81,445

గురజాలటౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వేంచేసియున్న పాతపాటేశ్వరి అమ్మవారి తిరునాళ్లను పురస్కరించుకొని సోమవారం అమ్మవారి హుండీ ఆదాయంను లెక్కించారు. మొత్తం రూ. 3,81,445 ఆదాయం సమకూరింది. కాగా గతేడాది కంటే ఈ యేడాది రూ. 48,939 అదనంగా ఆదాయం వచ్చింది. ఉత్సవాల ప్రత్యేకాధికారి కృష్ణంరాజు ఈ లెక్కింపును పర్యవేక్షించారు.

అమ్మవారికి వెండి కిరీటం సమర్పణ

పాతపాటేశ్వరి అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా అమ్మవారికి మిర్యాలగూడకు చెందిన కర్నాటి హరి, మిట్టపల్లి కుమార్‌లు అమ్మవారికి వెండి కిరీటాన్ని అందించారు. అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈవో పూర్ణచంద్రరావు, కమిటి సభ్యుడు పెరుమాళ్ల ప్రభాకర్‌కు ఈ కిరీటాన్ని అందించారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

రెంటచింతల,డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాలలో 25 మంది బాల బాలికలకు కార్డ్స్ సంస్థ ప్రతినిధులు దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ డిప్యూటీ డైరక్టర్ టీ.అమర్‌నాద్ ఆర్వీవో ప్రసాద్, నందనాయక్, వేల్పుల రవి, డాక్టర్ ఫ్రాన్స్ విశ్వనాధం, నాసరయ్య మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

మాచవరం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మాచవరం మండలంలోని వివిధ గ్రామాల్లో ఈ నెల 17 నుంచి 28వ తేదీ వరకు ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. 17, 18 తేదీల్లో మాచవరం, మోర్జంపాడు, 19, 20 పిన్నెల్లి, ఆకురాజుపల్లి, పిల్లుట్ల, 26న తురకపాలెం, మల్లవోలు, 27న చెన్నాయపాలెం, కొత్త గణేషునిపాడు, 28న వేమవరం, శ్రీ రుక్మిణీపురం గ్రామాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచు కోవాలని తెలియ జేశారు.

లింగ నిర్ధారణ కేంద్రాల్లో తనిఖీ

సత్తెనపల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు లింగ నిర్ధారణ కేంద్రాలను డాక్టర్ ధర్మసింగ్ శాస్త్రి సోమవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చట్ట ప్రకారం లింగ నిర్ధారణ పరీక్షలు చేయకూడదన్నారు. పీసీ పీఎన్ డీటీ చట్టం ప్రకారం పాటించాల్సిన నియమాల గురించి తెలియజేశారు. ఆయా కేంద్రాల్లోని రిజిస్టర్లను తనిఖీ ఆయన తనికీ చేశారు.

కంటి వైద్య శిబిరం

క్రోసూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : క్రోసూరు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సోమవారం అమరావతి బస్టాండ్ సెంటరులోని పెద మసీదు వద్ద ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. పంచాయతీ వైస్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ శిబిరాన్ని ప్రారంభించారు. శంకర్ కంటి ఆస్పత్రి వైద్యులు శిబిరంలో వైద్య సేవలు అందజేశారు. ఈ సందర్భంగా 120 మందికి ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 80 మందిని కళ్ళ జోళ్ళకు ఎంపిక చేశారు. 30 మందిని కంటి ఆపరేషన్‌ల కోసం ఎంపిక చేయగా, వారికి దశల వారీగా శంకర్ కంటి ఆస్పత్రిలో ఆపరేషన్‌లు చేస్తామని వైద్యులు తెలిపారు. శిబిరంలో పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ ఆదినారాయణ, క్యాంపు కో-ఆర్డినేటర్లు కరుణశ్రీ, రవికాంత్, ఆస్పత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో వీఆర్‌ఏ మృతి

పెదకూరపాడు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లగడపాడు గ్రామానికి చెందిన వీఆర్‌ఏ వేమవరపు ఆశీర్వాదం (57) గుండె పోటుతో మృతి చెందాడు. సోమవారం తెల్లవారు జామున గుండె నొప్పి తీవ్రంగా రావటంతో మెరుగైన వైద్యం కోసం మంగళగిరి ఎయిమ్స్‌కు తీసుకు వెళ్ళగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆశీర్వాదం మృత దేహాన్ని తహసీల్దార్ మీసాల డానియేలు సందర్శించి నివాళులర్పించారు. మట్టి ఖర్చుల నిమిత్తం ప్రభుత్వ పరంగా అందాల్సిన ఆర్థికసాయాన్ని అందించారు. 40 సంవత్సరాలుగా ఆశీర్వాదం వీఆర్‌ఏగా సేవలు అందిస్తూ అందరితో కలివిడిగా ఉండేవారని ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు గుర్తుచేసుకున్నారు.

పేదలకు పక్కా ఇళ్లు!

- పీఎం జన్‌మన్ పథకం కింద గిరిజనులకు 260 గృహాల నిర్మాణం
- గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క ఇల్లు కట్టని వైనం
- ఆనందం వ్యక్తం చేస్తున్న గిరిజనులు

ఎన్నో ఏళ్లుగా పూరి గుడిసెల్లోనే కాలం వెళ్లదీస్తున్న గిరిజనులకు పీఎం జన్‌మన్ (ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ మహా అభియాన్) పథకం వరంగా మారింది. ఈ పథకం ద్వారా ఆయా గూడాల్లో గ్రామ సభలు నిర్వహించి సొంత ఇల్లు లేని లబ్ధిదారులను గుర్తించడంతో పాటు ఆయా ప్రాంతాల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేసి పక్కా ఇళ్లు నిర్మిస్తున్నారు.

వెల్దుర్తి,డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి మండల పరిధిలోని 19 గిరిజన తండాలకు పీఎం జన్‌మన్ (ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ మహా అభియాన్) పథకం 260 గృహాలు మంజూరయ్యాయి. ఈ పథకం కింద పూరిగుడిసెల స్థానంలో పక్కా గృహాలు నిర్మించనున్నారు. గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం గిరిజనుల పథకాలు పక్కదారి పట్టించడమే కాక ఒక్క ఇల్లు కట్టించిన దాఖలాల్లేవని గిరిజనులు విమర్శిస్తున్నారు.



నిర్మాణం దశలో ఉన్న గృహం

ఒక్కో గృహానికి రూ. 2.39 లక్షలు..

పీఎం జన్‌మన్ పథకం కింద నిర్మించనున్న గృహాలకు త్వరితగతిన బిల్లులు మంజూరు కావడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గృహం బేస్‌మెంట్ పూర్తినాటికి రూ.70 వేలు, శ్లాబ్ లెవల్‌కు రూ.90 వేలు, శ్లాబ్ అనంతరం రూ.40 వేలు మంజూరు చేయనున్నారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రూ. 27 వేలు, టాయిలెట్స్‌కు రూ.12 వేలు అందించనున్నారు. ఇలా మొత్తంగా ఒక్కో ఇల్లు నిర్మాణానికి రూ. 2.39 లక్షలను ఈ పథకం ద్వారా అందించనున్నారు.

వివిధ దశల్లో గృహాలు..

డిసెంబరు నెల చివరి నాటికి గృహ నిర్మాణాలు పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం బేస్‌మెంట్ లెవల్‌లో 65, రూఫ్ లెవల్‌లో 28, శ్లాబ్ పూర్తి చేసికున్నవి 21 గృహాలు దాకా ఉన్నాయి. ఒక గృహం నిర్మాణం పూర్తయింది. మరో 150 గృహాల నిర్మాణాలు మొదలుపెట్టాల్సి ఉంది. దీంతో ఎన్నో యేళ్లుగా పూరిగుడిసెల్లో మగ్గుతున్న గిరిజనుల సొంతింటి కల నెరవేరబోతోంది.

ఆనందంగా ఉంది ..
- బయమ్మ, యర్రబాలెం



ఎన్నో యేళ్లుగా పూరి గుడిసెల్లో జీవనం సాగిస్తున్నాం. పీఎం జన్‌మన్ పథకం ద్వారా గృహం మంజూరు కావడం ఆనందంగా ఉంది. బిల్లులు కూడా ఎప్పటికప్పుడు త్వరితగతిన విడుదల అవతున్నాయి. ఆర్థికబారం లేకుండా ఇంటిని పూర్తి చేసుకోగలిగాం.

డిసెంబరు చివరికి పూర్తి చేసేందుకు చర్యలు
- దుర్గా ప్రసాద్, హౌసింగ్ ఏఈ



గృహాల నిర్మాణాలు డిసెంబరు నెలాఖరు నాటికి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. బిల్లులు కూడా త్వరితగతిన మంజూరవుతున్నాయి. ఇప్పటికే చాలా వరకు గృహాల నిర్మాణాలు చేపట్టాం. మిగిలినవి త్వరలోనే ప్రారంభించి పూర్తి చేస్తాం.

స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దుతాం

సత్తెనపల్లి మునిసిపల్ కమిషనర్ షమ్మి





సత్తెనపల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి పట్టణాన్ని స్వచ్ఛ సత్తెనపల్లిగా తీర్చిదిద్దటానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని. రాబోయే ఆరు నెలల్లో సంపూర్ణ పారిశుధ్య పట్టణంగా తీర్చిదిద్దుతామని, మునిసిపల్ పారిశుధ్య సిబ్బందికి ప్రజలు సహకరించాలని మునిసిపల్ కమిషనర్ కే షమ్మి తెలిపారు. పట్టణంలో పారిశుధ్యం నిర్వహణపై ఆయనతో ఆంధ్రజ్యోతి ప్రతినిధి **'ఫటాఫట్.'**

ప్రశ్న : చెత్త సేకరణ ఎలా జరుగుతోంది ?

జవాబు : తెల్లవారు జామునే పారిశుధ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ చేస్తున్నారు. తడి, పొడి చెత్త సేకరణ వేర్వేరుగా జరుగుతోంది. ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డుకు తరలిస్తున్నాం.

ప్రశ్న : పరిశుభ్రతపై ప్రజలకు ఎలాంటి అవగాహన కల్పిస్తున్నారు?

జవాబు : ఇంట్లో చెత్తను రోడ్డుపై వేయ కుండా డ్వాక్రా మహిళలు, పారిశుధ్య సిబ్బంది ద్వారా పలు మార్లు అవగాహన కల్పించాం. తడి చెత్త, పొడి చెత్త వేరు చేయటం, డ్రెయిన్లు, రోడ్ల పక్కన చెత్త వేయకుండా పారిశుధ్య సిబ్బందికి అప్పగించే విధంగా అవగాహన కల్పించాం.

ప్రశ్న : రోజుకి ఎన్ని టన్నుల చెత్త సేకరిస్తున్నారు?

జవాబు : ప్రతి రోజు 28 టన్నుల చెత్త సేకరణ చేస్తున్నాం. ఈ చెత్తలో ఐదు టన్నులు పిడుగురాళ్ళ, 23 టన్నులు జిందాల్ ఫ్యాక్టరీకి పంపిస్తున్నాం.

ప్రశ్న : దోమలు ప్రబలకుండా ఏం చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు : ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహిస్తున్నాం. కాలువల్లో దోమల లార్వా పెరగకుండా ఆయిల్ బాల్స్ వేస్తున్నాం. రాత్రి సమయాల్లో ఫాగింగ్, దోమల నిర్మూలనకు స్ప్రే చేస్తున్నాం.

రోగులకు మెరుగైన వైద్యం అందించండి

- గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు
- ప్రభుత్వ వైద్యశాలలో ఆకస్మిక తనిఖీ
- మందులు బయటకు రాయటంపై ఆగ్రహం



వైద్యులను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

గురజాలటౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యశాలలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ ఇటీవల ఈ ఆస్పత్రిపై తనకు ఫిర్యాదులు చేశారన్నారు. ఆస్పత్రికి రోజుకు ఎంత మంది రోగులు వస్తున్నారు, ఓపీ ఎలా సాగుతోంది, వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తున్నారా? వంటి విషయాలపై ఆరా తీశారు. మందుల కొరత ఉందా అని వైద్యులను ప్రశ్నించగా లేదని వైద్యులు సమాధానమిచ్చారు. అలాంటప్పుడు మందులు బయట మెడికల్ షాపులో తెచ్చుకోమని ఎందుకు రాస్తున్నారని వైద్యులను ప్రశ్నించారు. మందులు, పలు టెస్ట్‌ల విష యంలోనూ ఇదే జరుగుతోందని అన్నారు. మీ వ్యాపారాల కోసం రోగులకు ఇబ్బంది పెట్టవద్దని హెచ్చరించారు. ఈ వారంలో ఆస్పత్రికి సంబంధించిన విషయాలపై సమీక్ష నిర్వహిస్తామని అన్నారు. త్వరలోనే ఆస్పత్రి అభివృద్ధి కమిటి ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే యరపతినేని అన్నారు.



సెమీ క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా

క్రీస్తు బోధనలు ఆచరణీయం

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి) : ఏసుక్రీస్తు బోధనలను ప్రతి ఒక్కరు ఆచరించి ఆయన చూపిన శాంతి మార్గంలో పయనించాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని సెంటినరీ తెలుగు బాప్టిస్టు టౌన్ చర్చిలో సోమవారం రాత్రి జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘ పెద్దలు ఎమ్మెల్యే కన్నాను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బలిజేపల్లి సురేష్‌కుమార్, బండారు నాగరాజు, గంధం మోషే, అంకాళ్ల ప్రభుదాసు, గుజ్జర్లపూడి స్టాలిన్, చర్చికమిటీ సభ్యులు పాల్గొన్నారు.

22న జాబ్ మేళా

సత్తెనపల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సత్తెనపల్లి పట్టణంలో ఈనెల 22న జరగనున్న మెగా జాబ్ మేళా కార్యక్రమం కరపత్రాలను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సోమవారం తన కార్యాలయంలో పార్టీ నేతలతో కలసి ఆవిష్కరించారు. డిగ్రీ కళాశాల ఆవరణలో నిర్వహించే ఈ జాబ్‌మేళాలో ఆరు కంపెనీల ప్రతినిధులు హాజరై అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని ఆయన తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆళ్ళ అమరేశ్వరరావు, గోగినేని కోటేశ్వరరావు, కల్లం వీరభాస్కర్‌రెడ్డి, అంచుల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వాలు అందజేత

సత్తెనపల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 8వ వార్డులో సోమవారం రాత్రి నిర్వహించిన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొని పలువురికి సభ్యత్వాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద రూపాయలు చెల్లించి సభ్యత్వం తీసుకోవటం ఐదు లక్షల వరకు ప్రమాద బీమా పొందవచ్చన్నారు. కార్యక్రమంలో గుజ్జర్లపూడి స్టాలిని, నూర్ బాషా జానీ బాబు, కే దేవానంద్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠ వీరభద్ర స్వామికి మహా రుద్రాభిషేకం

నకరికల్లు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): కుంకలగుంటలో వేంచేసి ఉన్న భద్రకాళి సమేత ఉత్కంఠ వీరభద్రస్వామి దేవాలయంలోసోమవారం వేకువ జామునే మార్గశిర మాసం ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకొని స్వామివారికి విశేష అభిషేకాలు చేశారు. కాశీ విశ్వేశ్వర స్వామికి వివిధ రకాల ద్రవ్యాలు, ఫలాలతో అభిషేకాధి పూజలు చేశారు. అనంతరం ఉత్కంఠ వీరభద్ర స్వామి, కాశీ విశ్వేశ్వర స్వామి, భద్రకాళి అమ్మవారిని విశేషంగా అలంకరించారు. పూజా కార్యక్రమాలను ఆలయ అర్చక స్వామి ముప్పాళ్ళ విశ్వనాథ శాస్త్రి నిర్వహించారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

కారంపూడి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక అంకాళమ్మ దేవాలయం వద్ద సోమవారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ పట్టణ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ, తండా మస్తాన్‌జానీలు మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వంతో ఎంతో భరోసా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌పీఆర్ కృష్ణ, బాలునాయక్, తోట నరసింహారావు, జానీ, మీరావలి తదితరులు పాల్గొన్నారు.



సత్తెనపల్లి పట్టణంలోని 10వ వార్డులో ఉండే షేక్ రోషిణీ జూనియర్ సివిల్ జడ్జిగా ఎన్నిక కాగా, సోమవారం ఆమె గృహానికి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ వెళ్ళి బొకే అందించి అభినందించారు. ఆయన వెంట పలువురు టీడీపీ నేతలు ఉన్నారు. **- సత్తెనపల్లి**

సాగు నీటి కష్టాలు ముగిసినట్టే !

- ఎకరం పొలం కూడా ఎండిపోవడానికి వీల్లేదు
- మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

రెంటచింతల, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): నీటి సంఘాల ఏర్పాటుతో సాగు నీటి కష్టాలు ఇక ముగిసినట్లేనని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఏకగ్రవంగా ఎన్నికైన సాగు నీటి సంఘాల అధ్యక్ష,ఉపాధ్యక్షులు, సభ్యులు మండలంలోని మంచికల్లు గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డిని కలిశారు. రైతుల నమ్మకాన్ని వమ్ముచేయకుండా రైతుల అభ్యున్నతి మేరకు నడుచుకోవాలని ఎమ్మెల్యే వారికి సూచించారు. చివరి భూముల వరకు నీళ్లందేలా కృషి చేయాలని ఏ ఒక్క ఎకర పొలం ఎండిపోవడానికి వీల్లేదన్నారు. రిజర్వాయర్ల నిండా నీరు పుష్కలంగా ఉందన్నారు. రెంటచింతల మండలంలో వివిధ మేజర్ల కింద వేలాది ఎకరాల భూమి సాగవుతుందని, ఏ ఆయకట్టుకు ఎంత నీరు వదలాలో ఆయా సంఘాల కమిటీలు చూసుకుని రైతులకు వెన్నుదన్నుగా ఉండాలన్నారు. ఎన్నికైన వారందర్ని ప్రత్యేకంగా అభినందించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో పొట్ల నరశింహారావు, మద్దిగపు పిచ్చిరెడ్డి, సింహాద్రి బాపూజీ, వెంపటి హనుమంతరావు, బెల్లంకొండ శ్రీనివాసరావులతో పాటు మండల టీడీపీ నేతలున్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను చేరుకోవాలి

● ఎంపీడీవో జీవీ సత్యానారాయణ

రాజుపాలెం, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి): సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను చేరుకోవటంలో మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని ఎంపీడీవో సత్యానారాయణ కోరారు. స్థానిక మండల పరిషత్‌కార్యాలయంలో రాష్ట్రీయ గ్రామస్వరాజ అభియాన్‌లో భాగంగా 'సుస్థిరాభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ' అంశంపై సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీయం శివకుమార్ పేదరికంలేని మెరుగైన జీవనోపాధి కల్పన గురించి వివరించారు. ఆరోగ్య పర్యవేక్షకులు జీవన్‌రావు మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన గ్రామాలు ఏవిధంగా అభివృద్ధి చెందలో, రోగాల నుండి ఎలా రక్షించుకోవాలి అనే అంశాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భావనా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రసన్న, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రాజుపాలెం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సత్యనారాయణ

సుస్థిరాభివృద్ధి లక్ష్యసాధనలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి : ఎంపీడీవో శ్రీనివాసరావు

మాచవరం, (ఆంధ్రజ్యోతి) : రేపటి కోసం సుస్థిరాభివృద్ధి లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని, అప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధిస్తామని ఎంపీడీవో శ్రీనివాసరావు సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా ప్రతినిధులకు, ప్రభుత్వశాఖల అధికారులకు శిక్షణాతరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 - 26 ఆర్థిక సంవత్సరానికి గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రత్యేక ప్రణాళికలు తయారు చేసుకొని వాటి ప్రకారం అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంటుందన్నారు. 16, 17 తేదీల్లో చెన్నాయపాలెం, గంగిరెడ్డిపాలెం, మాచవరం, పిన్నెల్లి, తురకపాలెం, వేమవరం గ్రామాల వారికి శిక్షణా తరగ తులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శివయాదవ్, ఈవోఆర్‌డీ వెంగళరావు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్యమైన గ్రామ స్వరాజ్యాన్ని నిర్మిద్దాం
- ఎంపీడీవో శివప్రసాద్

దుర్గి,(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య కరమైన గ్రామ స్వరాజ్యాన్ని నిర్మించే బాధ్యత మనందరిపై ఉందని ఎంపీడీవో శివప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొని సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా 9 అజెండా అంశాలను పొందుపరిచిందని, ప్రతి ఒక్కరూ వాటిని పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సత్య ప్రసాద్, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు పద్మజ, నాగేంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

సత్తెనపల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈనెల 17 నుంచి 20 వరకు, 26 నుంచి 28వ తేదీ వరకు ఆధార్ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ షమ్మి సోమవారం తెలిపారు. ఈనెల 17వ తేదీ టీటీడీ కళ్యాణ మండపం, 10వ, 30వ వార్డు అంగన్‌వాడీ కేంద్రాల్లో, 18న టీటీడీ కళ్యాణ మండపం, 15వ,18వవార్డు అంగన్‌వాడీకేంద్రాలు, పశువుల ఆస్పత్రి ఏరియా, 19వ తేదీ టీటీడీ కళ్యాణ మండపం, 19వ అంగన్‌వాడీకేంద్రం, సుందరయ్య కాలనీ సచివాలయం, 20న టీటీడీ కళ్యాణ మండపం, 27వ, 20వ వార్డుల అంగన్‌వాడీ కేంద్రాలు, 26న టీటీడీ కళ్యాణ మండపం, కృష్ణవేణి జూనియర్ కళాశాల, 27న టీటీడీ కళ్యాణ మండపం, సుగాలీ కాలనీ జడ్పీ హైస్కూల్, ఎస్‌వీఆర్ డిగ్రీ కళాశాల, 28న టీటీడీ కళ్యాణ మండపం, ప్రగతి డిగ్రీ కళాశాల, 16వ వార్డు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆధార్ కేంద్రాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆధార్ చేర్పులు, మార్పులు, ఇతర సేవల కోసం ఆయా కేంద్రాలకు వెళ్లాలని కమిషనర్ షమ్మి సూచించారు.

పేదలకు దుస్తుల పంపిణీ

అచ్చంపేట, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేల్పూరు గ్రామంలో సోమవారం శిఖా రాజారావు ఆధ్వర్యంలో సెమీక్రిస్మస్ 7వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా అంబేద్కర్ ఛారిటబుల్ ట్రస్ట్‌చైర్మన్ చిలుకా చంద్రయ్య హాజరుకాగా ఉపాధ్యాయులు చిలుకా సుందరరావు, అంజనేయులు, శీలం వినయ్ కుమార్, దిబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.


విద్యతోనే పేదల అభ్యున్నతి

ముప్పాళ్ళ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పేద వర్గాల వారు విద్య ద్వారానే అభివృద్ధి చెందుతారని కార్డ్స్‌సంస్థ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ జీ.సుబ్బారావు అన్నారు. సోమవారం ముప్పాళ్ళ ఎస్సీకాలనీలో బాలబాట డెవలప్‌మెంట్ ఆర్గనైజర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్గనైజర్లకు చీరలను పంపిణీచేశారు. కార్యక్రమంలో డెవలప్‌మెంట్ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

భూసమీకరణ పద్ధతిలోనే భూములిస్తాం


● ఆర్డీవో కి కర్లపూడి రైతుల వినతి

అమరావతి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి) తెలంగాణ రాష్ట్రం ఎరుబాలెం నుంచి రాజధాని అమరావతి మీదుగా నంబూరు వరకు నిర్మించనున్న రైల్వేలైన్ ప్రాజెక్టుకు సంబంధించి పల్నాడుజిల్లాలోని వైకుంఠపురం, ఎండ్రాయి, కర్లపూడి గ్రామాల్లో భూసేకరణకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే ఆయా భూములను భూసేకరణ చట్టం ద్వారా తీసుకోనున్నట్లు ఆ నోటిఫికేషన్‌లో ప్రకటించి రైతుల అభిప్రాయాలను కోరింది. అయితే కర్లపూడి గ్రామానికి చెందిన రైతులు అనంతవరం గ్రామ రెవెన్యూ పరిధిలోని తమకు చెందిన సుమారు 120 ఎకరాలు రాజధాని అమరావతికి భూ సమీకరణ చట్టం ద్వారా అందజేశామని, రైల్వే ప్రాజెక్టు కూడా ఆచట్టం ప్రకారమే భూములు తీసుకొని, రాజధాని రైతులకు ఇచ్చిన ప్యాకేజీ మాదిరిగా తమకు న్యాయంచేయాలని, లేకుంటే భూములు ఇచ్చేది లేదని తెలిపారు. ఈమేరకు సోమవారం సత్తెనపల్లి ఆర్డీవో కార్యాలయంలో జరిగిన ప్రజాదర్బార్‌లో ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డికి కర్లపూడి రైతులు వినతి పత్రం అందజేశారు. ఆర్డీవో స్పందిస్తూ ఈ విషయాన్ని కలెక్టర్ కరుణ్‌బాబు, పట్టణాభి వృద్ధిశాఖ మంత్రి పీ.నారాయణ దృష్టికి తీసుకెళ్తానని రైతులకు తెలియజేశారు.



ఆర్డీవోకు వినతి పత్రం అందజేస్తున్న కర్లపూడి రైతులు

కోటేశ్వరమ్మ మృతికి ఎమ్మెల్యే నివాళి



కోటేశ్వరమ్మ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన టీడీపీ సీనియర్ నేత దియ్యా శ్రీనివాసరావు (శివ) మాతృమూర్తి దియ్యా కోటేశ్వరమ్మ (91) మృతిపట్ల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సంతాపం వ్యక్తంచేశారు. సోమవారం పిడుగురాళ్లలో కోటేశ్వరమ్మ మృతదేహానికి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. రామచంద్రరావు, రామ కృష్ణ, బాబు, శ్రీను, సర్వేశ్వరరావు, వెంకటేశ్వర్లు, వీరస్వామి, చెన్నారావు, ఎల్‌వీఆర్, సురేష్, మల్లి కార్జునరావులు కోటేశ్వరమ్మ మృతదేహానికి నివాళులర్పించారు.

ఎమ్మెల్యేకి ఉపాధ్యాయ నేతల వినతి

సత్తెనపల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని, 12వ పీఆర్‌సీని అమలు చేయాలని కోరుతూ నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, పల్నాడుజిల్లా అధ్యక్షుడు కేఎస్.రావులు సోమవారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు వినతి పత్రాన్ని అందించారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.



గొడ్డలితో దాడి .. ఒకరికి తీవ్ర గాయాలు

మాచర్ల రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో ఇద్దరిపై గొడ్డలితో దాడి చేయగా ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని పశువేములలో సోమవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పశువేముల గ్రామంలో బెజవాడ బ్రహ్మంతో అతని మామ హరిశ్చంద్ర, మరికొందరు ఘర్షణపడి గొడ్డలితో దాడి చేయగా, బ్రహ్మం పెదనాన్న కొడుకు బెజవాడ రమేష్, అతని సోదరి మంగమ్మలు అడ్డుపడ్డారు. దీంతో రమేష్, మంగమ్మలకు గాయాలయ్యాయి. రమేష్ తలకు తీవ్ర గాయం కాగా మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు, అక్కడ నుంచి నరసరావుపేటకు తరలించారు. మంగమ్మ పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. రూరల్ సీఐ నఫీజ్‌బాషా బాధితుల నుంచి వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హుండీ సొత్తు అపహరణ.. ముగ్గురు అరెస్ట్

వెల్దుర్తి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): హుండీ సొత్తు అపహరణ కేసులో ముగ్గురు నిందితులను ఎస్ఐ సమందర్‌వలి అదుపులోకి తీసుకున్నారు. సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 14న మండలంలోని కండ్లకుంట గంగాభవాని దేవాలయంలో హుండీ పగులకొట్టి రూ. 1.05 లక్షలను కండ్లకుంటకు చెందిన మారబోయిన చంద్రయ్య కేశిరెడ్డి సాయి కృష్ణారెడ్డి, బొడ్డపాటి మార్కొండారెడ్డిలు దొంగిలించారన్నారు. వీరిని కండ్లకుంట గ్రామశివారులో అదుపులోకి తీసుకొని సొమ్మును రికవరీ చేశామన్నారు.

ఆటో బోల్తా : ఒకరు మృతి

మాచర్లటౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గేదెను తప్పించబోయి ఆటో బోల్తా పడగా ఒకరు మృతిచెందిన సంఘటన మండలంలోని కంభంపాడు వద్ద జరిగింది. రెంటచింతల వైపు నుంచి ప్రయాణికులతో వస్తున్న ఆటో కంభంపాడు వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన గేదెను తప్పించబోయి ఆటో బోల్తా పడింది. ఆటో పూర్తిగా నుజ్జునుజ్జయింది. ఈ సంఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న రెంటచింతలకు చెందిన కత్తి సుబ్బయ్య (50) అక్కడికక్కడే మరణించాడు. గాయపడిన ఐదుగురిని పట్టణంలోనిప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యులు గుంటూరు రిఫర్ చేశారు.

బహిరంగ ప్రకటన

మా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, మార్టూరు బ్రాంచ్ వారి సూచనలు పొంది యుండువలెనుగా యావన్మందికి తెలియచేయునది ఏమనగా... (నేటు) షేక్ ఎలారి జాన్ సాహెబ్ అలియాస్ షేక్ జానీ సాహెబ్ గారి కుమారుడు షేక్ కరిముల్లా గారి ఆస్తిని తనఖా పెట్టుకొని షేక్ కరిముల్లా గారు ఋణము పొందుటకు సమ్మతించినారు. కావున ఈ దిగువ షెడ్యూలు ఆస్తికి సంబంధించి ఎవరికైనా అభ్యంతరములు, క్లయిములు ఉన్నచో 7 రోజులలోపు తెలియచేయవలయును. ఎట్టి అభ్యంతరములు, క్లయిములు రానిచో మా క్లయింట్ సదరు షేక్ కరిముల్లా గారికి ఋణం మంజూరు చేయును. షి-షెడ్యూలు : 1వ అంటెం : ప్రకాశం జిల్లా, ఒంగోలు రిజిస్ట్రారు జిల్లా, మార్టూరు సబ్‌రిజిస్ట్రారు ఆఫీసు యిలాకా, మార్టూరు గ్రామ పంచాయితీ, మార్టూరు గ్రామ సర్వే నెం. 578/డీఏ ను, సర్వే నెం. 581/సి నులలో తహశీల్దారు, మార్టూరు వారి ఎంజాయ్మెంటు ప్రకారం మార్టూరు గ్రామ సర్వే నెం. 578/ఏఎ2బి నులో డోర్ నెం. 10-13, 10-14కును సమీపమున గల ఖాళీ స్థలమునకు హద్దులు **తూర్పు :** కనమర్లపూడి సీతారామాంజనేయులు, కోటేశ్వరరావు గార్ల ఆస్తి - ఈ దిశ 40 అ.లు, **దక్షిణం :** కాకపల్లి మాదబీరావు, వారల స్థలము - ఈ దిశ 43 అ.లు, **పడమర :** బి-షెడ్యూలు దాఖలా 1వ ఐటం ఆస్తి - ఈ దిశ 40 అ.లు, **ఉత్తరం :** మనము సొంతంగా వదులుతున్న 18 అడుగుల వెడల్పుగల బజారు - ఈ దిశ 43 అ.లు. యీ హద్దులలోని 191.11 చ.గ.లు లేక 159.767 చ.మీ.ల ఖాళీ స్థలమున్నూ DOC NO: 9286/2020, S.R.O. ఒంగోలు.

లంకా విజయ్‌కుమార్, లంకా వంశీక్రిష్ణ,
న్యాయవాదులు, 2వ లైను, రవీంద్ర నగర్, గుంటూరు.
సెల్ నెం. 9030595227, 9848052914.

చరిత్ర చూసొద్దాం రండి..


మహాచైత్యం నమూనా


కేంద్ర పురావస్తు సంగ్రహాలయం


బుద్ధుని రాతి శిల్పం


మట్టిపాత్రలు

● సజీవ సాక్ష్యాలుగా చారిత్రక ఆధారాలు

అమరావతిలో భారతప్రభుత్వం నిర్వహిస్తున్న పురావస్తు ప్రదర్శనశాల(మ్యూజియం) ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందింది. అమరావతిలో బౌద్ధమతం క్రీ.శ 14వశతాబ్దం వరకు ఆదరణ పొందింది. అందుకు సంబంధించిన ఆధారాలు, బుద్ధుని ధాతువులను ఉంచి, నిర్మించిన మహాచైత్యం దీనికి నిదర్శనం. ప్రస్తుతం అది శిథిలం అయినప్పటికీ దానిపై ఏర్పాటు చేసిన శిల్పసంపద, అమరావతి శిల్పకళను ప్రపంచానికి తెలియజేసింది. ఇవన్నీ ఇక్కడి మ్యూజియంలో చూడవచ్చు. అంతే కాకుండా రాతియుగంలో మానవులు వాడిన ఆయుధాలు, శిలాయుగంలో వాడిన ఆయుధాలు, నవీన యుగంలో వాడిన మట్టిపాత్రలు ఈ ప్రదర్శనశాలలో ఉన్నాయి. మన రాష్ట్ర చిహ్నం పూర్ణకుంభం కూడా అమరావతి శిల్పకళలో వెలుగుచూసిందే. వీటితోపాటు బుద్ధుని జీవిత ఘట్టాలను మ్యూజియంలోని శిల్పాలవలన ప్రత్యక్షంగా తెలుసుకోవచ్చు. శాతవాహనుల కాలంనాటి నాణాలు కూడా ఇక్కడ భద్రపరిచారు

మ్యూజియంలో ప్రవేశానికి 15 సంవత్సరాలు దాటినవారికి 5 రూపాయలు చెల్లించాలి. శుక్రవారం సెలవు. అమరావతి చేరుకోవడానికి విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, క్రోసూరు ప్రాంతాల నుండి రహదారి మార్గాల ద్వారా చేరుకోవచ్చు.


తవ్వకాలలో లభించిన గాంధార శిల్పం


పూర్ణకుంభం


పూర్వీకులు వినియోగించిన చేతి కడియాలు



అశోకుని కాలం నాటి ధర్మచక్రం



శాతవాహనకాలం నాటి సీసపు నాణెములు



పురాతన కంఠాభరణాలు



నవీన రాతియుగపు ఆయుధాలు

తొలి స్నాతకోత్సవానికి.. ఎయిమ్స్ ముస్తాబు

(5వ పేజీ తరువాయి)

ప్రతిపాదించారు. 2015 అక్టోబరులో కేంద్ర మంత్రివర్గం ఈ నిధులను మంజూరుచేయగా 2017 సెప్టెంబరులో నిర్మాణ పనులు మొదలయ్యాయి. నిర్మాణపరంగా అన్ని హంగులను పూర్తిచేసుకున్న మంగళగిరి ఎయిమ్స్‌ను 2024 సెప్టెంబరు 29న భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జాతికి అంకితం చేశారు.

పచ్చని కొండల నడుమ..

మంగళగిరి ఎయిమ్స్‌కు పలు ప్రత్యేకతలు కూడా ఉన్నాయని చెప్పుకోవాలి. ఇది రాష్ట్రానికి నడిబొడ్డున ఉండడం ఒక విశేషమైతే రాజధాని అమరావతిలో కూడా ఒక భాగంగా కుదురుకుంది. అంతేకాదు...దాదాపు రెండొందల ఎకరాల సువిశాల విస్తీర్ణంలో పచ్చని కొండల నడుమ ఆహ్లాదకరమైన వాతావరణంలో ఏర్పాటైంది. ఒక విధంగా చెప్పాలంటే దేశంలో ఇప్పటివరకు ఏర్పాటైన ఎయిమ్స్ ఆస్పత్రులన్నింటిలోను దిబెస్ట్ ఎయిమ్స్ అన్న ఖ్యాతి మంగళగిరి ఎయిమ్స్‌కే దక్కింది.

మంగళగిరి ఎయిమ్స్‌కు తొలి డైరెక్టరుగా డాక్టర్ ముఖేష్ త్రిపాఠి పనిచేయగా ప్రస్తుతం డాక్టర్ మదబానందకర్ రెండవ డైరెక్టరుగా ఈ ఏడాది జనవరి 24 నుంచి సేవలను అందిస్తున్నారు. ఈయన సర్జికల్ ఆంకాలజిస్టుగా విశేష అనుభవాన్ని గడించారు. డాక్టర్ టీఎస్ రవికుమార్ వైస్ ఛాన్సలర్‌గా కొనసాగుతున్నారు. ఇక పాలకమండలి సభ్యులుగా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి తాజాగా ఎన్నికయ్యారు.

రూ. పదికే ఓపీ సేవలు

మంగళగిరి ఎయిమ్స్‌లో రూ. పదికే వైద్యసేవలను అందిస్తున్నారు. అంతేకాదు... ఇతరత్రా శస్త్ర చికిత్సలకు, పలురకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలకు ఫీజులు బయటి లేబొరేటరీలతో పోల్చితే చాలా తక్కువ ఖర్చుతో అందరికీ అందుబాటులో ఉన్నాయి. కంప్లీట్ బ్లడ్ పిక్చర్‌కు రూ. 365, ఫాస్టింగ్ అండ్ ర్యాండమ్ బ్లడ్ షుగర్‌కు కలిపి రూ. 48, లివర్ ఫంక్షనింగ్ టెస్టుకు రూ. 225, కిడ్నీ ఫంక్షనింగ్ టెస్టుకు రూ. 225, లిపిడ్ ప్రొఫైల్, థైరాయిడ్ టెస్ట్, ఈసీజీకి, ఛాతీ ఎక్స్‌రేకు రూ. 60, మామొగ్రఫీకి రూ. 630, అల్ట్రా సోనోగ్రఫీకి రూ. 323, యూరిన్ ఎనాలిసిస్‌కు రూ. 35, హెచ్ఐవీ రాపిడ్ టెస్టుకు రూ. 150, హెచ్‌బీయస్ ఏజీ రాపిడ్ టెస్టుకు రూ. 28 వంతున ఛార్జీలు ఉన్నాయి.

అందుబాటులో ఉన్న విభాగాలు..

మంగళగిరి ఎయిమ్స్‌లో దాదాపు 27 స్పెషాలిటీ సేవా విభాగాలు, మరో 12 సూపర్ స్పెషాలిటీ సేవా విభాగాలు అందుబాటులో ఉన్నాయి. సూపర్ స్పెషాలిటీ సేవా విభాగాలలో కాలిన గాయాలు, ప్లాస్టిక్ సర్జరీ, గుండె మరియు హృదయనాళ వ్యవస్థ విభాగం, ఎండోక్రైనాలజీ అండ్ మెటబాలిజం, క్యాన్సర్ విభాగం, నెఫ్రాలజీ, న్యూరాలజీ, న్యూరోసర్జరీ, పిల్లల శస్త్ర చికిత్స, ఊపిరితిత్తుల వైద్యవిభాగం, రుమటాలజీ, కాన్సర్ శస్త్రచికిత్స, యూరాలజీ విభాగాలు ఉన్నాయి. ఇవిగాక మరికొన్ని ప్రత్యే ఓపీడీ క్లినిక్‌లను కూడా అందుబాటులోకి తీసుకువచ్చారు. వీటిలో సమగ్ర రొమ్ము సంరక్షణ, నొప్పి నివారణ, పాంక్రియాస్ క్లినిక్, జన్యు మరియు అరుదైన వ్యాధి క్లినిక్, అంటువ్యాధుల క్లినిక్, సౌందర్య శస్త్రచికిత్స అండ్ రీజెనరేటివ్ మెడిసన్, ఇంటర్వెన్షనల్ రేడియాలజీ క్లినిక్, జన్యుసంబంధిత కౌన్సిలింగ్, ఫుట్ అండ్ చీలమండల క్లినిక్, ఆర్త్రోస్కోపీ క్లినిక్, కౌమార గైనకాలజీ క్లినిక్, వంధ్యత్వ క్లినిక్, గైనీ అంకాలజీ క్లినిక్, హీమోథెరపీ క్లినిక్ వంటి ప్రత్యేక క్లినికల్ ఓపీడీ సేవలను ఇక్కడ అందుబాటులోకి తీసుకొచ్చారు.



పరీక్షా కాలమ్

చేతి రాత, అక్షరదోషాలపై దృష్టిపెట్టండి

● ప్రణాళికతో పది తెలుగులో అత్యధిక మార్కులు

గుంటూరు విద్య, 16 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షలకు టైమ్ టేబుల్ ఇప్పటికే ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో పరీక్షకు సిద్ధం అయ్యే విద్యార్థుల కోసం ఇటు ప్రభుత్వ పాఠశాలల్లో అటు ప్రైవేటు పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు ప్రారంభం అయ్యాయి. పాఠశాలల్లో పరీక్షల వాతావరణం మొదలైంది. ఈ నేపథ్యంలో పది విద్యార్థులు సబ్జెక్టుల వారీగా ఎక్కువ మార్కులు ఎలా తెచ్చుకోవాలి? సబ్జెక్టులు ఎలా ప్రిపేర్ కావాలి? అనే విషయాలను ఆంధ్రజ్యోతి నిపుణులైన ఉపాధ్యాయు ల సహకారంతో వివరిస్తోంది. ఇందులో భాగంగా తొలుత జరిగే తెలుగు పరీక్షకు ఎలా సిద్ధం కావాలో గుంటూరు నగరపాలక సంస్థ ఎస్‌కేపీబీ ఎంసీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు జరుగుమాల జేమ్స్ వివరిస్తున్నారు.

పదవ తరగతిలో తెలుగు సబ్జెక్టు విషయానికి వస్తే ప్రధానంగా అవగాహన ప్రతిస్పందన, వ్యక్తీకరణ, సృజనాత్మకత, భాషాంశాలు ఉంటాయి. మొదటి పాఠ్యపుస్తకం 12 పాఠాలు ఉంటాయి. ఉపవాచకంలో రామాయణ కథ నుంచి ప్రశ్నలు వస్తాయి. ఆయా పాఠ్యాంశాల నుంచి వచ్చే ప్రశ్నల్ని ప్రణాళికాబద్ధంగా చదువుకుని పరీక్షకు సిద్ధం అయితే గణితంతో సమా నంగా అత్యధిక మార్కులు తెచ్చుకునే అవకాశం ఉంది.

ప్రధానంగా కవి పరిచయాలు, నేపథ్యం, ప్రక్రియ, ఉద్దేశం వంటివి ఎక్కువ చదువుకోవాలి. ఆయా అంశాల్లో ఎక్కువ మార్కులు తెచ్చుకునే అవకాశం ఉంది. ఇందులో మార్కులు తగ్గించడానికి అవకాశం ఉండదు. సమాధానాలు ఎంత బాగారాసినా అక్షరదోషాలు లేకుండా చూసుకోవాలి.

● ఆయా ప్రశ్నలకి జవాబులు పాయింట్ల వారీగా రాస్తే మార్కులు ఎక్కువ వస్తాయి. తరువాత తెలుగు వ్యాకరణం ఎక్కువగా చదువుకొని సాధన చేయాలి. ఇందులో అలంకారాలు, చందస్సు, అర్థాలు, వ్యతిరేక పదాలు, నానార్థాలు, పర్యాయపదాలు, వ్యుత్పత్తి అర్థాలు, వాక్యాల వంటి భిన్నరకాల అంశాలపై ప్రశ్నలు వస్తాయి. ఆయా ప్రశ్నల విషయంలో కూడా అక్షర దోషాలు లేకుండా కచ్చితంగా రాయగలిగితే అత్యధిక మార్కులు వస్తాయి.

● ఇంకా ప్రకృతి వికృతి, సొంత వాక్యాలు వంటి ప్రశ్నలకు సమాధానాలు రాయాల్సి ఉంటుంది. ఇవన్నీ ప్రణాళిక బద్ధంగా చదువుకుని పరీక్షకు సిద్ధం కావాలి. ఆయా అంశాలకు సంబంధించి 32 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు.

● ఉపవాచకంలో రామాయణం కథ ఉంటుంది. ఇందులో రామాయణంలో పాత్రల గురించి ప్రధానంగా ప్రశ్నలు వస్తాయి. ఉదాహరణకు సీతమ్మ, రాముడు, దశరథ మహారాజు, మందర, కైక, గుహుడు, విభీషణుడు, జటాయువు తదితరుల పాత్రల గురించి రాయాలి. ఇవన్నీ నాలుగు మార్కుల ప్రశ్నలు. ఇక ఎనిమిది మార్కుల ప్రశ్నల విషయానికి వస్తే సీతారామ కల్యాణం, రావణాసురుడు సీతమ్మను అపహరించిన విధానం, రామ లక్ష్మణ భరత, శత్రుఘ్నులు జన్మించిన విధానం, రామ రావణ యుద్ధం ఏవిధంగా జరిగింది? ప్రశ్నలకు సమాధానాలు రాయాల్సి ఉంటుంది. ఇవి తప్పులు లేకుండా రాస్తే మంచి మార్కులు వస్తాయి.

● అదేవిధంగా పద్యాలు, చిన్న పద్యాలు, అపఠిత పద్యాలు, అపఠిటిత గద్యం ఉంటాయి. పద్యం, గద్యం ఇచ్చి దాని కింద నాలుగు ప్రశ్నలు ఇచ్చి చిన్నచిన్న వాక్యాలుగా సమాధానాలు రాయాల్సి ఉంది. ఈ పద్యాలు పాఠ్యపుస్తకాలు లేదా బయటనుంచి ప్రశ్నాపత్రంలో ఇచ్చే అవకాశం ఉంది.

● పరీక్ష హాల్లో విద్యార్థి ప్రవేశించగానే ఎటువంటి ఆందోళన చెందకూడదు. ప్రశాంతంగా పరీక్షకు సిద్ధం కావాలి. తాను చదివిన పాఠ్యాంశాల నుంచే ప్రశ్నలు వస్తాయనే ఆత్మవిశ్వాసంతో ఉండాలి.

● ముందుగా ప్రశ్నాపత్రాన్ని ఒకటికి రెండుసార్లు చదవాలి. తరువాత బాగా వచ్చిన ప్రశ్నలకు సమాధానాలు రాయాలి అక్షర దోషాలు లేకుండా విరామ చిహ్నాలు పాటిస్తూ పరీక్ష రాయాలి.

● ప్రశ్నలకు జవాబులు రాసే సమయంలో జవాబుకు జవాబుకు మధ్యలో గీత గీసుకోవడం చాలా అవసరం. సెక్షన్ నెంబర్ ప్రశ్న నెంబరు తప్పు లేకుండా వేయాలి. రాసిన పేపర్ మొత్తం చివరలో ఒకసారి పరిశీ లించుకోవాలి. సమయాన్నిబట్టి తప్పులు ఏమైనా ఉంటే సరిదిద్దుకోవాలి.



- జరుగుమాల జేమ్స్, తెలుగు ఉపాధ్యాయుడు, ఎస్‌కేబీపీఎంసీ ఉన్నత పాఠశాల, వేణుగోపాల నగర్ గుంటూరు

క్రీడా స్ఫూర్తితో గెలుపోటములను ఆస్వాదించాలి

● ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్


రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలో మూడోస్థానం సాధించిన గుంటూరు బాలికల జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

ఫిరంగిపురం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): క్రీడా స్ఫూర్తితోనే గెలుపు, ఓటములను ఆస్వాదించాలని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. సోమవారం ఫిరంగిపురం దీనాపూర్ ఆవరణలో ఆర్‌సీజేసీ కళాశాల, పల్నాడు జిల్లా రగ్బీ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో రెండో రోజు బహుమతి ప్రదానోత్సవ సభలో ముఖ్య అతిథిగా శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ జీవి తంలో చీకటి, వెలుగు, కష్టాలు, సుఖాలవలె ఆటల్లో గెలుపు ఓటములు ఉంటాయని ఆయన తెలిపారు. క్రీడా స్ఫూర్తితో ఉండి ఓడిన జట్లు మరింత కష్టపడి ముున్ముం దు గెలిచేలా కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్ర మంలో రాష్ట్ర స్థాయిలో బాలకల విభాగంలో సత్యసాయి జిల్లా జట్టుకు మొదటి బహుమతి, తూర్పు గోదావరి జిల్లా రెండో బహుమతి, గుంటూరు జిల్లా మూడో బహు మతి, అలాగే బాలుర విభాగంలో కర్నూలు జట్టుకు ప్రథ మ బహుమతి, ప్రకాశం జిల్లా ద్వితీయ బహుమతి, నెల్లూరు జట్టుకు తృతీయ బహుమతులను ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ అందజేశారు. కార్యక్రమంలో కార్ష్ సంస్థ వ్యవస్థాపకురాలు ఎం స్వర్ణలతాదేవి, ఆర్‌సీజేసీ కళాశాల కరస్పాండెంట్ కే మేరీ, పల్నాడు జిల్లా రగ్బీ అసోసియే షన్ జిల్లా ప్రెసిడెంట్ ఈ కృష్ణారెడ్డి, జనరల్ సెక్రటరీ రామాంజనేయులు, ఆర్‌సీజేసీ కళాశాల ప్రిన్సిపాల్ ఎండీ సుదర్శన్, సెయింట్ జేవీఆర్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ వీ జీవన్ మణిబాబు, బాలబాట డిప్యూటీ డైరెక్టర్ టీ అమరనాథ్, టీ డానియేలు, ఎంపీ సుబ్బారావు, ట్రెజరర్ ఎం ప్రకాష్, ఆనంద్ విజయబాబు, చుక్కా కొండయ్య, టీ హృదయరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు మండవ నరసింహారావు, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా త్రికోటేశ్వరస్వామి ఆరుద్రోత్సవం

● స్వామికి ఇరుముడులు సమర్పించిన మేధా దక్షణామూర్తి స్వాములు


శ్రీ త్రికోటేశ్వర స్వామి మూలవిరాట్

కోటప్పకొండ(నరసరావుపేట), డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి) : ప్రఖ్యాత శైవ క్షేత్రం కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి ఆరుద్రోత్సవం సోమవారం రాత్రి వైభవంగా జరిగింది. కోటయ్య స్వామికి మహన్యాస పూరక రుద్రాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. రాత్రి 12 గంటల సమయంలో పాత కోటేశ్వర స్వామి ఆలయం వద్ద కర్పూర జ్యోతి దర్శనం చేసుకొని భక్తులు పులకించి పోయారు. వివిధ జిల్లాల నుంచి నుంచి మేధా దక్షణామూర్తి మాలధారణ స్వాములు ఇరు ముడులతో కోటయ్య సన్నిధికి చేరుకున్నారు. కర్పూర జ్యోతి దర్శనం అనంతరం స్వామికి ఆవు పాలు, పెరుగు, నెయ్యి, తేనె, పంచదార, ఎండు ఫలాలు, సుగంధ ద్రవ్యాలు, విభూది, కుంకుమ, గంధం, తైలంలతో అభిషేకాలు నేత్ర పర్వంగా జరిగాయి. ఆలయంలో స్వామికి ఆరుద్రోత్సవ పూజలు ఘనంగా నిర్వహించారు. బుధవారం తెల్లవారుజామున స్వామికి అన్నాభిషేకం జరగనుంది. అనంతరం త్రికోటేశ్వర స్వామికి విశేష అలంకరణ చేస్తారు. ఉదయం 8 గంటలకు యాగశాలలో లక్ష్మీగణపతి, రుద్ర హోమాలు జరగనున్నాయి. ఆలయ ఈవో డీ చంద్రశేఖరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదల వాడ అరవిందబాబు ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. కొండపై ఉన్న పాత కోటేశ్వర స్వామిని అరవిందబాబు దర్శించుకున్నారు. స్వామికి ఆయన ప్రత్యేక అభిషేకాలు చేశారు.


పాత కోటేశ్వర స్వామికి అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు


ఇరుముడులతో కొండకు చేరుకున్న గోనెపూడికి చెందిన మేధా దక్షణామూర్తి మాలధారణ స్వాములు


అర్ధరాత్రి మార్కెట్ సెంటర్‌లో ఆకు కూరల వ్యాపారుల సందడి

నిశీథిలో.. నగరం ఇలా..




డివైడర్‌పై చలిలోనే నిద్రిస్తూ..


చిరు వ్యాపార బళ్లకు రక్షణగా..



నగరమంతా నిద్ర మత్తులో జోగుతున్న వేళ.. ఆకాశం నుంచి రాలే మంచు బిందువులు పొగలా మారి.. కారుచీకట్లు తొలగించే కాంతులను కమ్మిన సమయాన. పడుకోవడానికి ఇళ్లు.. కప్పుకోవడానికి రగ్గు లేక ఫుట్‌పాత్‌పై ప్లాస్టిక్ సంచి ఆదరవుతో ఒకరు గురకలు పెడుతుంటే. తెల్లారకముందే బతుకుదెరువు కోసం.. చెత్త ఏరుకుంటూ.. ఒడిలో చంటి బిడ్డతో ఒకరు.. వారిని రిక్షాలో కూర్చోబెట్టి ఆ బరువును నెట్టుకుంటూ మరొకరు.. ఆకుకూరల అమ్మకాల కోసం అప్పుడే బారులుతీరిన జనం.. ఇదీ సోమవారం తెల్లవారుజామున గుంటూరు నగర ముఖ చిత్రం.

గుంటూరు (ఆంధ్రజ్యోతి).


విద్యుత్ వెలుగులు.. మంచు దుప్పటితో కనువిందు చేస్తున్న గుంటూరు నగర రహదారులు

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

పలు గ్రామాల్లో ఆధార్ నమోదు కేంద్రాలు

చిలకలూరిపేట, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని గ్రామాల్లో ఈనెలలో ఆయా తేదీల్లో ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ప్రజలు సద్వినియోగించుకోవాలని ఎంపీడీవో కె.శ్రీనివాసరావు సోమవారం కోరారు. వేలూరు, మురికిపూడి-2 గ్రామ సచివాలయాల్లో, కోమటినేనివారిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్లో ఈనెల 17 నుంచి 20 వరకు శిబిరం ఉంటుందని తెలిపారు. పోతవరం, కావూరు గ్రామ సచివా లయాల్లో, కుక్కపల్లి వారిపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈనెల 26 నుంచి 28 వరకు శిబిరం నిర్వహిస్తామని వివరిం చారు.

● నూజెండ్ల: మండలంలోని గ్రామ సచివా లయాల్లో ఈనెల 17వ నుంచి 28వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ కేంద్రాలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో పీ ఉమాదేవి సోమవారం తెలిపారు. శుక్రవా రం ఏపీడబ్ల్యూఎస్ స్కూల్ ఉప్పలపాడు, 18వ తేదీ జంగాపల్లి గ్రామ సచి వాలయం, 19న తెల్లపాడు సచివాలయం, 20న కమ్మవారి ఎస్సీ కాలనీ, ముక్కెళ్ళపాడు సచివాలయం, 26న కంభంపాడు, ఫువ్వాడ సచివాలయాలు, 27న పమిడిపాడు, ముప్పరాజువారిపాలెం సచివాలయాలు, 28న మృత్యుం జాపురం గ్రామ పంచాయతీ, గాంధీనగర్, అంగన్‌వాడీ సెంటర్లో ప్రత్యేకంగా ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేశారని, నూతన ఆధార్‌లో చేర్పులు, మార్పుల కోసం ఈ కేంద్రాలను నిర్వహిస్తున్నామన్నారు.

నేడు స్వామివారికి ప్రత్యేక కల్యాణం

వినుకొండటౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బోసుబొమ్మ సెంటర్లో ఉన్న రామాలయంలో దనుర్మాస ప్రారంభం సందర్భంగా స్వామివారికి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులుతోపాటు మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

కెనాల్‌లో యువకుడి
మృతదేహం లభ్యం


పిట్టంబండ్ల మేజర్‌లో కొట్టుకొచ్చిన మృతదేహం

మతుకుమల్లి(శావల్యాపురం), డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధిలోని పిట్టం బండ్ల మేజర్ కాలువలో పడి యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని మతుకుమల్లి గ్రామశివారులో సోమవారం జరిగింది. స్థానిక ఎస్‌ఐ లేళ్ళ లోకేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు వినుకొండ పట్టణం సమీపంలోని నాగిరెడ్డిపల్లెకు చెందిన దాసరి వంశీ (21) ఐటీఐ చదువుకొని ప్రస్తుతం వినుకొండలోని హెచ్‌పీ గ్యాస్ కంపెనీలో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. వంశీ ఆదివారం ఉదయం ఇంటి నుంచి బయటకొచ్చి సాయంత్రానికి కూడా ఇంటికి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించారు. కానీ వంశీ అందుబాటులోకి రాకపోవడంతో వెదకటం ప్రారంభించారు. సోమవారం మ ధ్యాహ్నం శావల్యాపురం మండలం మతుకుమల్లి సమీపంలోని పిట్టంబం డ్ల మేజర్ కాలువలో గుర్తు తెలియని యువకుడి మృతదేహం నీటి ప్రవాహంలో తేలుతూ కొట్టుకు వస్తుండగా స్థానికులు గుర్తించి గ్రామ వీఆర్వోకి సమాచారం అందించారు. వీఆర్వో ఇచ్చిన రిపోర్టుపై శావల్యాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఎస్‌ఐ లోకేశ్వరరావు సిబ్బందితో ఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని కెనాల్ నుంచి బయటకు తీయించి పోస్ట్‌మర్టం నిమిత్తం వినుకొండలోని ప్రభుత్వాస్పత్రికి తరలిం చారు. విషయం తెలుసుకొన్న వంశీ తల్లిదండ్రులు, బంధువులు ప్రభుత్వాసుపత్రికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు వంశీగా గుర్తించి పోలీసులకు తెలియజేశారు. వంశీకి తల్లిదండ్రులు, సోదరి ఉన్నారు. వంశీ మృతి ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలియజేశారు.

స్పీడ్ బ్రేకర్లను తొలగించాలంటూ
ఎంపీడీవోకు వినతి

యడ్లపాడు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడు - కారుచోల గ్రామాల మధ్య యడ్లపాడు ఎస్సీ కాలనీ సమీపంలో వేసిన స్పీడ్ బ్రేకర్లు ప్రమాదకరంగా మారాయని, వాటిని వెంటనే తొలగించాలంటూ ఇరు గ్రామాల ప్రజలు కోరారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఎంపీడీవో హేమలతాదేవికి రెండు గ్రామాల ప్రజలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వా రు మాట్లాడుతూ రెండు గ్రామాల మధ్య మూడు కిలో మీటర్ల మేర ఆర్ అండ్‌బీ రోడ్డు ఉందని, నిత్యం ఈ మార్గంలో ఇరు గ్రామాల ప్రజ లు ప్రయాణిస్తుంటారన్నారు. సుమారు వంద మీటర్ల పరిధిలో 4 స్పీడ్ బ్రేకర్లను ఎత్తుగా ఏర్పాటు చేశారని, దీనితో ద్విచక్రవాహనాలు అదుపుతప్పి ప్రయాణికులు గాయాలపాలవుతున్నారన్నారు. ఇటీవల కారుచోల గ్రామానికి చెందిన వ్యక్తి ఈ మార్గంలో ప్రయాణిస్తూ స్పీడ్ బ్రేకర్ వద్ద కిందపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆర్‌అండ్‌బీ రోడ్డుపై ఎలాంటి అనుమతులు లేకుండా కాలనీవాసులు సొంతంగా స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేశారని, పాఠశాల సమీపంలో స్పీడ్ బ్రేకర్లను ఉంచి మిగిలిన వాటిని తొలగించాలని రెండు గ్రామాల ప్రజలు ఎంపీడీవోను వేడుకున్నారు.

హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయాలి

నూజెండ్ల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని జనవరి 5వ తేదీన జరగబోయే హైందవ శంఖారావ బహిరంగ సభను విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు భాగావతుల రవికుమార్ ఆదివారం రాత్రి మండలంలోని పాతచెరుకుంపాలెంలో సన్నా హక సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడు తూ హిందూ మతం గొప్పతనాన్ని మరింత తెలుసుకోవాలని, ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో జరుగుతున్న పరిస్థితులను తెలుసుకోవాలన్నారు. హిందూ దేవాలయాల్లో వచ్చే ఆదాయాన్ని ప్రభుత్వాలు, ఇతర మతాల అభివృద్ధికి ఖర్చు చేయటం మంచి పద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ పల్నాడు జిల్లా ఘోష్ ప్రముఖ్ కొప్పరావూరి కోటేశ్వరరావు, యువ మోర్చా ఉపాధ్యక్షులు జెడ్డా లక్ష్మీనారాయణ, పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదర్బారుకు సమస్యలు వెల్లువ

● ప్రతి అర్జీదారుడికి అండగా ఉంటాం
● ప్రభుత్వ చీఫ్ జీవీ ఆంజనేయులు
● అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు


దివ్యాంగుల పింఛను కోసం జీవికి వినతిపత్రం అందజేస్తున్న వృద్ధులు

వినుకొండ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యలయంలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి అధ్యక్షతన సోమవారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణంలోని విద్యుత్, రెవెన్యూ, ఆరోగ్యం వంటి సమస్యలపై జీవీ ఆంజనేయులుకు స్థానిక ప్రజలు వినతి పత్రాలు అందజేశారు. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ గత ప్రభుత్వ హయాంలో పెన్షన్ పొందలేకపోయామని కార్యాలయాల చుట్టూ తిరిగి దరఖాస్తులు ఇచ్చినా ఫలితం లేక తీవ్ర ఇబ్బందులకు గురయ్యామంటూ దివ్యాంగులు జీవీ ఆంజనేయులు వద్ద కన్నీటి పర్యంతమయ్యారు. అదేవిదంగా పట్టణంలో లోవోల్టేజి సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, మరికొన్ని ప్రాంతాల్లో నివాస గృహాలపైన విద్యుత్ వైర్లు వేలాడి ప్రమాదం పొంచి ఉందంటూ స్థానికులు అధికారుల వద్ద మొరపెట్టుకున్నారు. అర్జీలు స్వీకరించిన అనంతరం జీవీ మాట్లాడుతూ గత ప్రభుత్వం వ్యవహారతీరుపై ప్రజలు ఆగ్రహానికి గురై ఎన్డీఏ ప్రభుత్వాన్ని అత్యధిక మెజార్టీతో గెలిపించారని, గతంలో ఏనాడు ప్రజాదర్బార్ కాదు కదా.. కనీసం ప్రజానాయకుడి వద్ద సమస్యలు వినిపించే పరిస్థితి లేదని ఆజాద్‌కాలనీ, ఎన్ఎస్‌పీ కాలనీ శివారు కాలనీల్లో పేదలు ఎదుర్కొంటున్న సమస్యలు వర్ణణాతీతం అని అన్నారు. అమృతజలజీవన్ పథకం ద్వారా త్వరలో ప్రతి పేదవాడి ఇంటికి మంచినీటి కుళాయి నిర్మిస్తామని, ఎన్ఎస్‌పీ కాలనీలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుబాష్ చంద్రబోస్, తహసీల్దార్ సురేష్, పట్టణ సీఐ శోభన్‌బాబు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒక్క ఇల్లు అయినా జగన్‌రెడ్డి పంపిణీ చేశారా?

వినుకొండటౌన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో రాష్ట్రంలో ఎక్కడైన మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న కాలనీలో కానీ, టిడ్కో గృహాల్లో కానీ ఒక్క ఇల్లు అయిన పంపిణీ చేశారా అని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాల యం ఆవరణలో ప్రజాదర్బార్ అనంతరం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుపరిపాలన అందించడమే చంద్రబాబు లక్ష్యమని, ప్రతి పేదవాడికి ఎన్డీఏ ప్రభుత్వం అండగా ఉంటుం దని, రాష్ట్రంలో ఎక్కడైన రౌడియిజాన్ని, గుండాయిజాన్ని ఉక్కుపాదంతో అనిచివేస్తామని, గంజాయి మారక ద్రవ్యాలు విక్రయాలపై అధికారులు దృష్టిసారించాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆస్తులు దాచుకోవడం, దోచుకోవడం తప్ప పేదలకు చేసిందేమీ లేదన్నారు. విజన్ 2047 నాటికి ప్రతి కుటుంబానికి ఒక ఉద్యోగం, 30లక్షల రూపాయల తలసరి ఆదాయం తీసుకురావడమే లక్ష్యంగా రాష్ట్రంలో చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ అహర్నిశలు కృషిచేస్తున్నారని తెలిపారు. త్వరలో వినుకొండ పట్టణంలో శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ద్వారా నాలుగు బస్ షెల్టర్లను ఏర్పాటు చేస్తామన్నారు. ఎస్‌టీపీ పథకం ద్వారా మురుగు నీరు శుద్ధియంత్రాల ను త్వరలో ప్రారంభిస్తామని, ఇంటింటికి మంచినీటి కుళాయిలను నిర్మిస్తామని, ఎన్ఎస్‌పీలో అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశామని అన్నారు. ప్రజాసమస్యలపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టరు దస్తగిరి, కమిషనర్ సుభాస్ చంద్రబోస్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

● పల్నాడు జిల్లా కలెక్టర్ పీ అరుణ్‌బాబు


అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ పీ అరుణ్‌బాబు, ఇతర అధికారులు

నరసరావుపేట టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సమస్యలను సావధానంగా విని సత్వర పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పీ అరుణ్‌బాబు అన్నారు. సోమవారం నరసరావుపేటలోని కలెక్టర్ కార్యా లయంలో ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. జిల్లాలోని సుదూర ప్రాం తాల నుంచి వచ్చిన 40 మంది అర్జీదారులు తమ విన తులను కలెక్టర్, ఇతర అధికారులకు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తమ సమస్యలు పరి ష్కారం అవుతాయనే నమ్మకంతో నలుమూలల నుంచి అర్జీదారులు ఇక్కడకి వస్తుంటారని అన్నారు. సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని, ఆ పరిష్కారంతో అర్జీదారు సంతృప్తి చెందాలని సూచించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి ఫిర్యాదు పరిష్కారం కావాలని ఆదేశించారు. ఇందుకు అన్ని శాఖల అధికారు లు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్, జిల్లా రెవెన్యూ అధికారి మురళి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో రోడ్లు కుచించుకుపోయాయి

● సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాంబాబు

నరసరావుపేట పట్టణంలో రోడ్లు ఏ మాత్రం విస్తరణ లేక, ఆక్రమణలతో కుంచించుకుపోయాయని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు అన్నారు. సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ వ్యాపారులు రోడ్లు మొత్తాన్ని ఆక్రమించుకొని వ్యాపారాలు చేసుకుంటున్నారే తప్ప నరరావుపేట పట్టణాన్ని అందమైన పట్టణంగా తీర్చి దిద్దుదామనే దృక్పథం కరువైందన్నారు. ప్రకాష్‌నగర్‌లోని బస్టాండ్ వెనుక వైపు ఉన్నటువంటి రోడ్డు మొత్తం ఆక్రమణకు గురైందని, రైల్వే స్టేషన్‌కు నడచి వెళ్లటానికి పాదాచారులకు రోడ్డు మార్గం లేకుండా పోయిందన్నారు. వినుకొండ రోడ్డు, సత్తెనపల్లి రోడ్డు, కలెక్టరేట్ కార్యాలయం రోడ్డు, పల్నాడు బస్‌స్టాండ్, రహదారి, పట్టణంలోని వివిధ రహదారులు వ్యాపార సముదాయాలతో కుంచించుకుపోయాయని వివరించారు. పట్టణంలో రోడ్ల ఆక్రమణలు తొల గించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి సీహెచ్ సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి వెంకట్, ఉప్పల పాటి రంగయ్య, ఎస్‌కే చిన్నజాన్‌సైదా, తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూ అథ్లెటిక్స్‌లో ఓవరాల్ ఛాంపియన్‌గా కృష్ణవేణి డిగ్రీ కళాశాల


విజేతలుగా నిలిచిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు తదితరులు

నరసరావుపేట టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర కళాశాల పురుషుల, మహిళల అథ్లెటిక్స్ పోటీల్లో కృష్ణవేణి డిగ్రీ కళాశాల ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచిందని ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. నాగార్జున విశ్వవిద్యాలయంలో సింథటిక్స్ ట్రాక్‌లో ఈ నెల 13, 14, 15 తేదీల్లో పోటీలు నిర్వహించారన్నారు. కే విశాలాక్షి ఆఫ్ మారథాన్‌లో గోల్డ్ మెడల్, మిక్స్ రిలేలో సిల్వర్, 10 కిలో మీటర్లు రిలేలో సిల్వర్ మెడల్ సాధించారని తెలిపా రు. ఎం శిరీష హెప్తాథిలిన్‌లో గోల్డ్ మెడల్, 800 మీటర్లు పరుగులో గోల్డ్‌మెడల్, 4/100 రిలేలో బ్రాంజి, ఎం హేమలత మిక్స్ రిలే సిల్వర్, 4/400 మీటర్లు పరుగులో బ్రాంజి, టీ కస్తూరి 400మీటర్ల పరుగులో బ్రాంజ్, హాఫ్ మారథాన్‌లో సిల్వర్, ఎం చౌడేశ్వరి 400 మీటర్ల హర్డిల్స్‌లో గోల్డ్ మెడల్, 4/400 రిలేలో బ్రాంజి, ఎం లక్ష్మీ పా వని 400 మీటర్లు హర్డిల్స్‌లో సిల్వర్, వినోదిని డిస్కస్ త్రోలో సిల్వర్, ఏ అశ్విని హెప్తాథిలిన్‌లో బ్రాంజి, బీ అలేఖ్య 1500 మీటర్లు పరుగులో బ్రాంజి, 4/100 మీటర్ల పరుగుపందెంలో బ్రాంజి, పీ హేమలత హేమర్ త్రోలో బ్రాంజి, కే అనూష 400 మీటర్లు రిలేలో బ్రాంజి, సీహెచ్ దుర్గ భవాని రేస్ వాక్‌లో బ్రాంజి, భవ్యజ్యోతి హై జంప్‌లో బ్రాంజి, గోపినాధ్ మిక్స్ రిలేలో సిల్వర్, యోహోవా శివ మిక్స్ రిలేలో సిల్వర్ మెడల్స్ సాధించారు. మెడల్స్ సాధించిన విద్యార్థులను పీడీ ఈదర ఆదిబాబు, ఎస్‌కే మహమ్మద్ తదితరులు అభినందించారు.

ఎంఏఎం విద్యార్థికి పతకాలు


ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర కళాశాల పురుషుల, మహిళలు అథ్లెటిక్స్ పోటీల్లో ఎంఏఎం విద్యార్థులు పతకాలు సాధించారని చైర్మన్ ఎంఆర్ శేషగిరిరా వు సోమవారం తెలిపారు. ఏ సంజయ్ షాట్‌పుట్‌లో బంగారు, డిస్క్‌త్రోలో వెండి పతకం సాధించారన్నారు. ఈ సందర్భంగా ఏ సంజయ్‌ను ప్రిన్సిపాల్ ఎస్ రామారావు, ఎంబీఏ విభాగాధిపతి ఎం సితార, పీడీ జె.శంకర్, అధ్యాపకులు అభినందించారు.


శోభయాత్రలో పాల్గొన్న పీఠాధిపతులు, భజన మండలి సభ్యులు

శంకర భాష్య పారాయణాంజలి
శోభయాత్ర

నరసరావుపేట టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలో శాంకర భాష్య పారాయణాంజలిలో భాగంగా శోభ యాత్ర సోమవారం నిర్వహించారు. జగద్గురువులు శంకరాచార్యులు భారతీ తీర్థ మహాస్వామి 50వ సన్యాస స్వీకార మహోత్సవం, మహాసన్నిధానం 75వ వర్ధంతి నరసరావుపేటలోని శృంగేరి శంకరమఠంలో నిర్వహిస్తున్నారు. ఆయా కార్యక్రమాల్లో భాగంగా మొదటిరోజు పట్టణంలోని సత్తెనపల్లి రోడ్డులో ఉన్న విజయ కల్యాణ మండపం నుంచి శోభ యాత్ర జరిగింది. 50మంది పీఠాధిపతులు, స్వామీజీలు, 400మంది భజన మండలి కోలాటాలతో ఈ శోభయాత్ర నిర్వహించారు. అనంతరం పట్టణంలోని శృంగేరి శంకర మఠంలో పారాయణ కార్యక్రమ ప్రారంభోత్సవ సభ జరిగింది. కార్యక్రమంలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు. శంకరభాష్య పారాయణాంజలి కార్యక్రమాలు ఈ నెల 29వరకు జరుగుతాయని నిర్వహకులు తెలిపారు.

వేంకటేశ్వర స్వామి ఆలయంలో
ధనుర్మాస పూజలు


ప్రత్యేక అలంకరణలో కల్యాణ వేంకటేశ్వరస్వామి

నరసరావుపేట అర్బన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ ఆవరణలోని కామేశ్వర స్వామికి ఆరుద్రోత్సవం సందర్భంగా అభిషేకాలు నిర్వహించారు.

● నూజెండ్ల: మార్గశిర మాస బహుళ పక్షం ధనుర్మాసం ప్రారంభం మొదటి రోజైన సోమవారం నూజెండ్లలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రవ్వవరం శ్రీవేంకటేశ్వర జగన్మాత పీఠం, అప్పాపురం శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవాలయం, ముక్కెళ్ళపాడు రామాలయం తదితర గ్రామాల్లోని విష్ణుదేవాలయాల్లో స్వామికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

● రొంపిచర్ల: మండలంలోని విప్పర్ల గ్రామంలో ఉన్న వల్లభేశ్వర స్వామి ఆలయంలో ఆరుద్రోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు సోమవారం నిర్వహించారు. పంచామృతాలతో అభిషేకా లను అర్చకులు చందలూరి పరమేశ్వరరావు చేశారు. భజనా కార్యక్రమాలు జరిగాయి. ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలను అందజేశారు.

దొంగతనాలకు పాల్పడితే గ్రామ బహిష్కరణ


సమావేశంలో మాట్లాడుతున్న నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు

వినుకొండటౌన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): పల్నాడు, ప్రకాశం జిల్లా ల్లో ట్రాన్స్‌ఫార్మర్ల రాగివైరును దొంగిలిస్తున్న ముఠాను పోలీసులు అదుపు లోకి తీసుకున్నారు. వారి నుంచి సుమారు నాలుగు క్వింటాళ్ళ రాగితీగలు స్వాధీనం చేసుకొని.. దొంగిలించిన నలుగురిని సోమవారం నరసరావుపేట డీఎస్పీ కె.నాగేశ్వరరావు అరెస్టు చూపారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినుకొండ నియోజకవర్గంతోపాటు పల్నాడు జిల్లా, ప్రకాశం జిల్లాలో మొత్తం 27 కేసుల్లో దొంతనాలకు పాల్పడిన నల్లబోతుల పెదరంగయ్య, బత్తుల కోటయ్య, వీరబోయిన బాలె య్య, తొలుసూరి లక్ష్మీనారాయణను ఐనవోలు గ్రామంలోని ఆర్చీ వద్ద వారిని అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు. రైతులు కాయకష్టంచేసి సంపాదించి నీటికోసం ఏర్పాటుచేసుకున్న ట్రాన్సఫార్మర్లను పగులకొట్టి రాగివైరును దోచుకుంటున్నారని, ట్రాన్సఫార్మర్ల జోలికి పోతే రానున్న రోజు ల్లో గ్రామ బహిష్కరణ చేస్తామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. రైతులు ట్రాన్సఫార్మర్లు దొంగిలించారని ఫిర్యాదులు చేస్తారే తప్ప కోర్టుల్లో సాక్ష్యం చెప్పేందుకు ముందుకు రాకపోవడంతో కేసులు నిలబడటంలేదని.. అందుకే వీరు తరుచు దొంగతనాలకు పాల్పడుతున్నారని, ఇప్పటికైన రైతులు స్పందించాలన్నారు. కార్యక్రమంలో సీఐలు ప్రభాకర్, శోభనబాబు, ఎస్‌ఐలు బీవీ కృష్ణారావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి లక్ష్యాల సాధనకు కృషి చేయాలి

నాదెండ్ల, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): సర్పంచులతో పాటు కార్యద ర్శులు, గ్రామాల సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు కృషి చేయాలని ఎంపీడీవో ఎస్ స్వరూపరాణి కోరారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గ్రామ స్థాయిలో చేపట్టాల్సిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాల గురించి సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బందికి, తదితర శాఖల అధికారులకు నాలుగు రోజులపాటు జరిగే శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భం గా గ్రామ స్థాయిలో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల రూప కల్పన, అమలు, బడ్జెట్ అంచనాలు తదితర విషయాలపై అధికారి మోహనరావు శిక్షణ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ తలతోటి రాణి, ఈవోపీఆర్‌డీ నిర్మల లక్ష్మికుమారి, ఏవో ఏ హరిప్రసాదు, ఎంఈవో కృష్ణారెడ్డి, ఏఈలు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, ఏపీఎం ఎం రమేష్ బాబు, వైద్యాధికారి కవిత, సైదారావు, కెన్నడి తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 21 కుట్టు మిషన్ల పంపిణీ

చిలకలూరిపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక రోటరీ క్లబ్ ఆఫ్ పండరీపురం ఆధ్వర్యంలో సోమవారం 21మంది మహిళలకు కుట్టు మిషన్లను ఉచితంగా అందజేశారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ రోటరీ క్లబ్ వారి సహకారంతో వీటిని సమకూర్చారు. ముఖ్యఅతిథిగా పట్టణ ప్రము ఖులు సీహెచ్ విజయ్‌కుమార్ హాజరయ్యారు. కార్యక్రమంలో లోక్ సత్తా భానుప్రసాద్, విన్సెంట్ పాల్, రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు శరత్ కుమార్ శాస్త్రి, కొల్లా సుబ్బారావు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించాలి

● ఎస్పీ కంచి శ్రీనివాసరావు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ కంచి శ్రీనివాసరావు

నరసరావుపేట లీగల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అందిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులకు ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి 75 ఫిర్యాదులను స్వీకరించారు. క్రోసూరు మండలం విప్పర్ల గ్రామానికి చెందిన నర్ర రమేష్ ఈఏడాది తన పంటను లక్ష్మీశెట్టి రవికుమార్, తన్నీరు మార్కండేయులు అనే వారికి అమ్మానని తనకు రూ.70 లక్షలు రావాల్సి ఉండగా కేవలం తొమ్మిది లక్షలు ఇచ్చి మిగిలిన నగదును ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నట్లు తనకు న్యాయం చేయవలసిందిగా ఫిర్యాదు చేశారు. ఎన్టీఆర్ జిల్లా నందిగం గ్రామానికి చెందిన షేక్ నూర్జ హాన్‌కు బరంపేటలో 50 సెంట్ల స్థలం ఉందని దానిని పటాన్‌లాల్ సాహెబ్, షేక్ ఆదం వలీలు దొంగ రిజిస్ట్రేషన్ చేయించుకొని తనను ఇబ్బంది పెడుతున్నారని తన కు న్యాయం చేయవలసిందిగా ఫిర్యాదు చేశారు. నరసరా వుపేట మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన కుంభ సత్యనారాయణ ఫిర్యాదు చేస్తూ గోపాల్‌రావు అనే వ్యక్తి రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తానని తన వద్ద 3 లక్షల తీసుకొని తిరిగి ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడని తనకు న్యాయం చేయవలసిందిగా ఫిర్యాదు చేశారు. పట్నంలోని పెద్ద చెరువుకు చెందిన బండి రామబ్రహ్మం, శ్రీనివాస్‌రావు కొమ్ము అన్నపూర్ణలు తమ పిల్లలకు వివిధ శాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి సిరికొండ వెంకట్రావు అనే వ్యక్తి 36 లక్షల 40 వేల రూపాయలు తీసుకొని ఉద్యోగం ఇప్పించకుండా డబ్బులు ఇవ్వకుండా మోసం చేసినట్లు తమకు న్యాయం చేయవలసిందిగా ఫిర్యాదు చేశారు. అమరావతి మండలం మునుగోడు గ్రామానికి చెందిన బంక సంధ్యారాణికి ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి పొన్నగంటి రమ్యశ్రీ అనే మహిళ రెండు లక్షల పద్నాలు గు వేల రూపాయలు తీసుకొని మోసం చేసినట్లు ఫిర్యా దు చేశారు. చిలకలూరిపేటకు చెందినగోపి దేశి కోటేశ్వరమ్మ ఫిర్యాదు చేస్తూ తన కుమారుడు, కోడలు తాను చనిపోయానని నమ్మించి నకిలీ పత్రాలు సృష్టించి తన ఆస్తినంతటిని అమ్మివేసి తన సంక్షేమం పట్టించుకోకుండా ఇంటి నుంచి గెంటి వేశారని తాను ప్రస్తుతం ఆంజనేయస్వామి గుడి వద్ద భిక్షాటన చేసి జీవిస్తున్నా నని తనకు న్యాయం చేయవలసిందిగా ఫిర్యాదు చేశారు. పిడుగురాళ్ల మండలం తుమ్మలచెరువు గ్రామానికి చెంది న సయ్యద్ కరీమూన్ రెండో కుమారుడు నాగూర్ సైదా మద్యం తాగి వచ్చి తన పేరు మీద ఉన్న ఆస్తిని రాయమని కొడుతున్నాడని అతనితోపాటు అతని అను చరులు బాజీ, పాండు అనేవాళ్ళు కూడా తనను ఇబ్బంది పెడుతున్నట్లు తనకు న్యాయం చేయవలసిందిగా ఫిర్యా దు చేశారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ప్రజలకు వారి ఫిర్యాదులు రాసి పెట్టడంలో పోలీస్ సిబ్బంది సహాయ సహకారాలు అందించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులకు దాతలు భోజన ఏర్పాటు చేశారు.

విజేతలుగా నిలిచిన జనసేన అభ్యర్థులకు సత్కారం

నరసరావుపేట టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట, రొంపిచర్ల మండలంలోని విప్పర్ల నీటిసంఘాల ఎన్నికల్లో జనసేన అభ్యర్థి రామిశెట్టి వెంకటేశ్వర్లు నీటిసంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దాసరిపాలెం అభ్యర్థి నిమ్మల శ్రీనివాసరావు టీసీ సభ్యుడి గా ఎన్నికయ్యారు. వారిని పట్టణంలోని జనసేన కార్యాల యంలో సోమవారం జనసేన రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలానీ సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో అచ్చుల సాంబశివరావు, ఆకుల కొండలు, షేక్ జాన్ బాషా, గడ్డిగుంపల రామాంజనేయులు, తదితరు లు పాల్గొన్నారు.

రామినేని రోహన్‌కు జీవీ సత్కారం


రోహన్‌ను సన్మానిస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ, మాజీ ఎమ్మెల్యే మక్కెన


వినుకొండటౌన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): కామన్వెల్త్ కరాటే పోటీల్లో స్వర్ణం, కాంస్య పతకాలు సాధించిన వినుకొండ మండలం పెదకంచర్ల గ్రామానికి చెందిన రామినేని రోహన్‌ను ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు స్థానిక తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో సోమవారం సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇలాంటి మరెన్నో పతకాలు సాధిం చి దేశానికి, రాష్ట్రానికి పల్నాడు ప్రాంతంలోని వినుకొండకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతోపాటు మాదాల చిరంజీవి, కంచర్ల గ్రామానికి చెందిన తెలుగుదేశంపార్టీ నాయకులు పెద్దలు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలి : సీపీఎం


పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా యడ్లపాడులో విద్యుత్ బిల్లులను తగులబెడుతున్న సీపీఎం నాయకులు

యడ్లపాడు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పెంచిన విద్యుత్ చార్జీల ను వెంటనే తగ్గించాలని సీపీఎం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా యడ్లపాడులో సీపీఎం నాయకులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. యడ్లపాడు సెంటర్ లో విద్యుత్ బిల్లులను దహనం చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు సీపీఎం నాయకులు మాట్లాడుతూ ట్రూఅప్ చార్జీలు, ఎఫ్‌పీపీసీఏ చార్జీల పేరుతో ప్రజలపై భారం మోపడం అన్యా యమన్నారు. ఎఫ్‌పీపీసీఏ చార్జీల విధింపుతో ప్రతి నెలా వస్తున్న బిల్లు కన్నా అదనంగా 50శాతం చెల్లించాల్సి వస్తుందన్నారు. ప్రస్తుత నెలలో విధించిన ఎఫ్‌పీపీసీఏ చార్జీలు ఏప్రిల్ 2022కు సంబంధించినవని, ఈ విధంగా మరో ఏడాది పాటు ప్రతి వినియోగదారుడు చెల్లించాల్సి ఉంద న్నారు. ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించి ప్రజలకు ఊరట కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బందెల పీటర్, నూతలపాటి కాళిదాసు, గోగడ హరిబాబు, కల్లూరి రామారావు, ముత్తవరపు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలిండియా నెట్‌బాల్ పోటీలకు ధనలక్ష్మి కళాశాల విద్యార్థులు



ఎ వెంకటరమణ   పీ రమేష్

ఈపూరు, డిసెంబరు 16: మండలంలోని ధనలక్ష్మి వ్యాయామ కళాశాల విద్యార్థులు ఆల్ ఇండియా నెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ చుండు వెంకటరావు సోమవారం తెలిపారు. ఈనెల 13, 14 తేదీల్లో చిలకలూరిపేట డీఆర్ఎన్ఎస్ సీవీఎస్ కాలేజీలో జరిగిన నెట్‌బాల్ అంతర్ కళాశాల పోటీల్లో పాల్గొని తృతీయస్థానం సాధించినట్లు తెలిపారు. జట్టులో ప్రతిభ కనబరిచిన ఏ వెంకటరమణ, పీ రమేష్‌లు జనవరి 2వతేదీ నుంచి రాజస్తాన్ జైపూర్‌లో జరిగే ఆలిండియా అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో పాల్గొనే ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ మేదరమెట్ల రామశేషగిరిరావు, అధ్యాపకులు, ఆర్ బలరాం నాయక్, ఎం దాస్, సీహెచ్ అరవింద్, కే వంశీలు అభినందించారు.